



రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న బాలిక కుటుంబ సభ్యులు

6ఎ కేసులు ఎందుకు పెట్టడం లేదు

- విత్తనాల షాపుల్లో తనిఖీలపై అలసత్వం - వ్యవసాయ శాఖ పనితీరు బాగోలేదు - కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతుంటే వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం నిద్రపోతున్నారని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆగ్రహం వ్యక్తం చేశారు. విత్తనాల దుకాణాలను కూడా ఏప్రిల్ నుంచి ప్రారంభిస్తే ఇప్పటివరకు ఎందుకు తనిఖీలు చేపట్టలేదని ప్రశ్నించారు. నకిలీ విత్తనాల అమ్ముతున్న షాపులపై 6ఎ కేసులను ఎందుకు పెట్టడం లేదని వ్యవసాయ శాఖాధికారులను ప్రశ్నించారు. ఈ శాఖ అధికారుల పనితీరు బాగోలేదని మండిపడ్డారు. మంగళవారం వ్యవసాయ శాఖపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నకిలీ విత్తనాల వల్ల రైతులు నష్టపోకూడదని ఇటీవల జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ అంశంలో జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారుల పని తీరు ఏమీ బాగోలేదన్నారు. 732 అవుట్‌లెట్స్ ఉంటే కేవలం 349 మాత్రమే తనిఖీ చేశారని తెలిపారు. మిగతా వాటిలో ఎందుకు తనిఖీలు చేయలేదని ప్రశ్నించారు. చిప్పగిరి మండలంలో 10 విత్తన దుకాణాలుంటే ఒక్కదాంట్లో కూడా తనిఖీలు చేయలేదని తెలిపారు. ఆదోని మండలంలో 196 ఉంటే కేవలం 25 దుకాణాల్లో తనిఖీ చేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగిలిన మండలాల్లో కూడా ఇదే పరిస్థితి ఉందన్నారు. ఇలా ఉంటే ఏమాత్రం సహించబోమని అధికారులను హెచ్చరించారు. ఈ అంశాలపై ఏడీఏలనే నేరుగా ప్రశ్నిస్తానని స్పష్టం చేశారు. రైతు ఆత్మహత్యలు లేని జిల్లాగా కర్నూలు ఉండాలని తెలిపారు. సాయిల్ శ్యాంపిల్స్‌కు సంబంధించి 10,252కు గాను 3,226 మాత్రమే తీశారని, ఇంకా 7,026 పెండింగ్ ఉన్నాయని చెప్పారు. ఈనెల 28లోపు పూర్తి కావాల్సి ఉండగా ఇంకా 70 శాతం పెండింగ్ ఉండటం ఏమిటని ప్రశ్నించారు. కోసిగి, కర్నూలు, పత్తికొండ, మద్దికెర మండలాల్లో చాలా తక్కువ శ్యాంపిల్స్ తీశారని తెలిపారు. క్రిష్ణగిరిలాంటి మండలాలు 254 శ్యాంపిల్స్ తీసినప్పుడు, మీరెందుకు తీయలేకపోయారని ప్రశ్నించారు. కౌలు రైతులకు ఇవ్వనున్న క్రాప్ కల్టివేటర్ రైట్ కార్డ్ (సిసిఆర్‌సి) కార్డులకు సంబంధించి లక్ష్యం వాస్తవానికి అనుగుణంగా లేదన్నారు. నిర్దేశించిన 10 వేల లక్ష్యంలో కూడా కేవలం 3,166 మాత్రమే సాధించారని తెలిపారు. చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచడంలో భాగంగా రాగికి మార్కెట్ బాగుందని, జిల్లాలో కార్డుదారులకు కర్ణాటక నుంచి రాగులు తెప్పించి ఇవ్వాల్సి వస్తోందని చెప్పారు. కార్డుదారులకు పంపిణీ చేసే రాగులను మనమే పండించి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఎపిఎంఐడి పీడీ ఉమాదేవి, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రామచంద్రయ్య, ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు, మత్స్య శాఖ అధికారి శ్యామల, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ షర్మిల, మార్క్‌ఫెడ్ మేనేజర్ రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

ఉపాధి పనిదినాలు పెంచాలి - కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ఉపాధి హామీ పని దినాలను మరింత పెంచాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో డ్వామా, పంచాయతీ రాజ్ అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉపాధి హామీ పనుల శాతాన్ని గణనీయంగా పెంచాలని తెలిపారు. తక్కువ శాతం నమోదు చేసిన ఎమ్మిగనూరు, వెల్దుర్తి ఏపీడీలను కలెక్టర్ వివరణ కోరారు. సాంకేతిక సమస్య వల్ల హాజరు నమోదు చేయలేకపోతున్నామని వారు వివరించారు. ఆధార్ అనుసంధానానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మినీ గోకులం పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న చెల్లింపులు పూర్తి చేయాలన్నారు. చెత్తసంపద తయారీ కేంద్రాలకు సంబంధించి నిర్మాణాలను పూర్తి చేసేలా చూడాలన్నారు. వాటర్ షెడ్ల నిర్మాణాలకు సంబంధించి ఈనెలలో నిర్దేశించిన మేరకు లక్ష్యాలను సాధించాలని తెలిపారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి ఏమైనా నగదు రికవరీలు ఉంటే సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని ఆగస్టు 15లోపు పూర్తి చేయాలని జిల్లా విజిలెన్స్ అధికారి సిద్ధలింగమూర్తిని ఆదేశించారు. డ్వామాకు సంబంధించి 2021-22 ఆర్థిక సంవత్సరంలో పెండింగ్ పనులపై కలెక్టర్ ఆరా తీశారు. 286 పనులను క్లోజ్ చేసినట్లు, అమృత్ సరోవర్ ట్యాంకులకు సంబంధించి నిర్దేశించిన 75 ట్యాంకుల నిర్మాణం పూర్తి చేసినట్లు, హార్టికల్చర్ ప్లాంటేషన్‌కు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసినట్లు డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. పంచాయతీ రాజ్‌కు సంబంధించి ప్రాధాన్యతా భవన నిర్మాణ పనుల్లో వేగం పెరగాలని కలెక్టర్ ఆదేశించారు. డిజిటల్ లైబ్రరీలకు అవసరమైన స్థలాన్ని గుర్తించి త్వరగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఇ సుబ్రమణ్యం, డిఇలు పాల్గొన్నారు.

బహిర్భూమికి అని తీసుకెళ్లి...

- బాలికను భర్తకు అప్పగించిన మహిళ - అత్యాచారయత్నానికి పాల్పడిన భర్త

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఓ మహిళ బాలికను నమ్మించి బహిర్భూమికని తీసుకెళ్లి తన భర్తకు అప్పగించి అత్యాచారయత్నానికి పాల్పడేలా చేసిన సంఘటన సోమవారం రాత్రి గోనెగండ్ల మండలం గంజిహళ్లి గ్రామంలో చోటు చేసుకుంది. నిందితులైన భార్యాభర్తలు తెలుగు చిన్న బడే సాహెబ్ అలియాస్ కొప్పోడు, బోడెమ్మ అలియాస్ బడెమ్మను అదుపులోకి తీసుకొని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు గోనెగండ్ల ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని బాధిత బాలిక కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మంగళవారం ఎమ్మిగనూరు, కర్నూలు ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. గంజిహల్లి గ్రామానికి చెందిన తెలుగు చిన్న బడేసాబ్, అతని భార్య బడెమ్మ ఎస్వీ.నగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరు హైదరాబాద్‌కు వలస వెళ్లి రెండు, మూడు రోజుల క్రితమే గ్రామానికి వచ్చారు. సోమవారం రాత్రి భార్యను తీసుకొని అదే గ్రామంలోని తమ దాయాదుల ఇంటికి చిన్నబడేసాబ్ వెళ్లాడు. రాత్రి సుమారు 7.30 గంటల సమయంలో బడెమ్మ తమ పక్కింటి వారితో మాట్లాడుతూ... తాను బహిర్భూమికి వెళ్లాలని, తోడుగా మీ కూతురును పంపమని అడిగారు. బాలికను తీసుకొని సమీపంలోని పొలంలోకి వెళ్లారు. అప్పటికే అక్కడ మాటు వేసిన ఆమె భర్త చిన్న బడేసాబ్‌కు బాధిత బాలికను అప్పగించి బడెమ్మ వెళ్లిపోయారు. అతడు బాలికపై అత్యాచారయత్నానికి ప్రయత్నించడంతో బాలిక కేకలు వేసింది. బాలిక అరుపులు విన్న చుట్టుపక్కన ఇళ్ల వారు కేకలు వేస్తూ బాలిక వద్దకు వెళ్లడంతో అది గమనించిన నిందితుడు బాలికను వదిలి పరారయ్యాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితులైన భార్యాభర్తలు ఇద్దరినీ అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టారు.



నిందితుడు చిన్నబడేసాబ్

ఉపాధ్యాయుని సస్పెన్షన్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పాఠశాల విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు వెంకటరమణను విధుల నుంచి సస్పెన్షన్ చేస్తున్నట్లు డిఇఒ రంగారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పత్తికొండ మండలంలోని హోసూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్, స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉపాధ్యాయుడు వెంకటరమణ సస్పెన్షన్ చేసినట్లు ఆయన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

స్వశక్తితో ఎదిగేందుకు మహిళా మార్టులు

- మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ విజయలక్ష్మి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు మహిళా మార్టులు ఎంతో ఉపయోగకరమని మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం నగరంలోని సి.క్యాంపు రైతుబజార్ సమీపంలో 'జగనన్న మహిళా మార్ట్'ను విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎంఎం మురళీ అధ్యక్షతన సభ ఏర్పాటు చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఈ మహిళా మార్ట్‌లో పెట్టుబడిదారులు, నిర్వాహకులు, లాభాలు తీసుకునేవారు మహిళలేనని తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవ్ తేజ మాట్లాడుతూ... కర్నూలు నగరంలో నిర్మించే షాపింగ్ కాంప్లెక్స్‌లలో టిఎల్ఎఫ్ మహిళలకు షాపులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఆరు నెలల్లో లాభాలు గడించి ఈ మహిళా మార్ట్ చాలడం లేదని ఇంకో చోట తమకు ఏర్పాట్లు చేయాలని కోరే స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. భవిష్యత్తులో డిజిటల్ మార్టులు కూడా మహిళలే నిర్వహించాలని చెప్పారు. స్టేట్ మిషన్ కోఆర్డినేటర్లు ఆదినారాయణ, ఎన్ఎన్ఆర్ శ్రీనివాస్ మాట్లాడుతూ... ముగ్గురు మహిళలు ఒకచోట కూడి ఉండలేరనే సామెత ఒకప్పటిదని, ఇప్పుడు వేలల్లో మహిళలు ఒకచోట చేరి ఆర్థికంగా ఎదుగుతున్నారని చెప్పారు. మెప్మా పీడీ ఎన్.నాగశివ లీల మాట్లాడుతూ... కర్నూలు నగరంలో 1,10,881 గృహాలు ఉన్నాయని, నగర జనాభా 4,33,829, మురికివాడల గృహాలు 27,129, మురికివాడల జనాభా 1,54,368, 52 వార్డుల్లో సెల్ఫీ గ్రూపులు 93,071, మురికివాడలోని ఫెడరేషన్లు 5, స్వయం సహాయక సభ్యులు 33,334, ఒక్కో సభ్యురాలు రూ.150 చొప్పున మొత్తం రూ.50 లక్షలు ఈ జగనన్న మహిళా మార్ట్‌లో పెట్టుబడి పెట్టారని తెలిపారు. రాష్ట్రంలో కర్నూలు మహిళా మార్ట్ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. టిపిఒ వెంకటలక్ష్మి, కార్పొరేటర్లు సత్యనారాయణమ్మ, నీలోఫర్, టిఎంసి.సుధాకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ భార్గవ్ తేజ

యోగాతోనే ఏకాగ్రత

- కన్సల్టెంట్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ అర్షద్, కిమ్స్ హాస్పిటల్, కర్నూలు
- అంతర్జాతీయ యోగా దినోత్సవం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

యోగాతో ఏకాగ్రత పెరుగుతుందని కన్సల్టెంట్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ అర్షద్ తెలిపారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రతేడాది జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగా వల్ల కలిగే శారీరక, మానసిక ప్రయోజనాలపై చైతన్యం కల్పించడమే అంతర్జాతీయ యోగా దినోత్సవం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. యోగా అనే పదం సంస్కృతం 'యజ' అనే దాని నుంచి వచ్చిందని తెలిపారు. 'యజ' అంటే చేరడం లేదా ఏకం చేయడమని అర్థమన్నారు. శరీరం, మనస్సును ఏకం చేయడమే యోగాలోని పరమార్థమని తెలిపారు. దాదాపు 500 ఏళ్ల చరిత్ర కలిగిన యోగాశాస్త్రం ప్రపంచానికి భారతీయులు అందించిన అద్భుతమైన కానుక అని చెప్పారు. శాంతి కోసం యోగా అనే నినాదంతో ప్రతేడాది యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తపోటు తగ్గించడానికి యోగా ఎంతగానే ఉపయోగపడుతుందని చెప్పారు. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల శరీరం అంతా రక్తప్రసరణ బాగా జరుగుతుందని తెలిపారు. అందువల్ల ప్రాణవాయువు కలిగిన రక్తం శరీరంలో అన్ని అవయవాలకు బాగా అందుతుందన్నారు. రక్తపోటు అనేది తగ్గుతుందని తెలిపారు. ఒత్తిడి వల్ల కలిగే రక్తపోటును కూడా యోగా తగ్గిస్తుందని చెప్పారు. యోగా చేసే ముందు ఓ గ్లాసు నీరు తాగడం చాలా మంచిదన్నారు. ముందుగా శ్వాస ప్రక్రియలు, ప్రాణాయామంతో శ్వాసపై ధ్యాస పెట్టాలని సూచించారు. వ్యాయామం చేసేటప్పుడు వార్మప్ ఎలాగో ఈ యోగాలో ఈ ప్రాణాయామాలు అలాంటివేనని తెలిపారు. ఇలా చేయడం వల్ల ఆసనాలను అలుపు లేకుండా చేయవచ్చని చెప్పారు. మనస్సును దృఢంగా మార్చడంలోనూ, ఒత్తిడిని నివారించడంలోనూ, మోకాళ్ల నొప్పులను దూరం చేయడంలోనూ, మెదడు పనితీరును మెరుగు పరచడంలోనూ ఇలా ఎన్నో విధాలుగా యోగా ఉపయోగపడుతుందని తెలిపారు. అందుకే రోజుకు కనీసం 20 నిమిషాలైనా యోగా చేస్తే ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండవచ్చని చెప్పారు. మానవ శరీరంలో అతి ముఖ్యమైన సున్నితమైన భాగాల్లో గుండె ఒకటని, ఈ మధ్యకాలంలో జీవనశైలిలో మార్పులు, చెడు ఆహార అలవాట్లు, ఒత్తిడి, నిద్రలేమి, వాతావరణ కాలుష్యం కారణంగా చాలా మంది గుండె సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. యువకులు సైతం హార్ట్ ఫెయిల్యూర్ బారిన పడుతున్నారని, సరైన వ్యాయామం, విశ్రాంతితో పాటు మంచి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటే గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని సూచించారు. గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి యోగాసనాలు సహాయపడతాయని తెలిపారు. వీరభద్రాసనం, శీర్షాసనం, హలాసనం, భుజంగాసనం లాంటి ఆసనాలు వేయడం ద్వారా గుండె సమస్యలకు దూరంగా ఉండవచ్చని సూచించారు.





విద్యార్థినికి అభినందనలు తెలుపుతున్న ప్రిన్సిపల్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) బిఎ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని చంద్రప్పదేవి ఒలంపిక్ డే రన్‌లో ప్రథమ బహుమతిని సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినికి కళాశాల ప్రినిపల్. జె. హేమంత్ అభినందనలు తెలియజేశారు. జిల్లా ఒలింపిక్ డే రన్‌లో ప్రథమ స్థానంలో సాధించడం కళాశాలకు గర్వకారణమన్నారు. వైస్ ప్రిన్సిపల్ ఎ.సత్యనారాయణ మాట్లాడుతూ చంద్రప్ప దేవి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అభినందన సభలో కళాశాల న్యాక్ కోఆర్డినేటర్ డా. కె.జి. మల్లికార్జున, అధ్యాపకులు లక్ష్మణగుప్త, వ్యాయామ అధ్యాపకులు వై.శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ఓపెన్ బ్లాస్టింగ్ ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ఓర్వకల్లు మండలం గుమితం తండాలో చేస్తున్న ఓపన్ బ్లాస్టింగ్‌ను ఆపాలని సిఐటియు జిల్లా నాయకులు శ్రీధర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఓర్వకల్లు మండలం గుమితం తండా దగ్గర జరుగుతున్న జల విద్యుత్ కేంద్రం ఓపెన్ బ్లాస్టింగ్ పనులను తండా ప్రజలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడారు. గ్రామానికి దగ్గర్లో ఓపెన్ బ్లాస్టింగ్ చేయడం వలన ఇంటి ముందర కస్సు కొడుతుండగా స్వామి నాయక్ కూతురు తృటిలో పెను ప్రమాదం తప్పిందన్నారు. గ్రీన్ కో కంపెనీ వారు గ్రామానికి దగ్గరలో ఉన్న జల విద్యుత్ కేంద్రం ఓపెన్ బ్లాస్టింగ్ ఆపాలని, కంట్రోల్ బ్లాస్టింగ్ చేయాలని హెచ్చరించారు. ఇప్పటికే ఇలాంటి సంఘటన మూడోసారి అని, ఇలాంటి సంఘటన పునరావతం కాకుండా చూడాలనిన్నారు. గుమితం తాండ గ్రామ ప్రజలకు, జల విద్యుత్ కేంద్రాల్లో పని చేస్తున్న ప్రతి కార్మికునికి సిఐటియు అండగా ఉంటుందని వారు చెప్పారు.



అధికారులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు శ్రీధర్

జగన్ పాలనలో దాడులు, దౌర్జన్యాలు, దోపిడీలు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - పత్తికొండ

రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పాలనలో దాడులు, దౌర్జన్యాలు, దోపిడీలు పెట్రేగిపోతున్నాయని, అసలు పోలీసు వ్యవస్థ పని చేస్తుందా అని అనుమానం వస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. మంగళవారం కర్నూలు జిల్లా పత్తికొండ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాపట్లలో బాలుడు అమర్ నాథ్ హత్య, విశాఖలో ఎంపీ భార్య, కొడుకు కిడ్నాప్, కడపలో దళిత డాక్టర్ అచ్చన్నను చంపి డోర్ డెలివరీ, సిఎం సొంత నియోజకవర్గం పులివెందులలో దళిత మహిళలపై అత్యాచారం, హత్య తదితర ఘటనలను సిఎం జగన్ ఖండించకపోగా, డిజిపి మాత్రం లా అండ్ ఆర్డర్ బాగుందని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. పత్తికొండలో ఆంధ్రజ్యోతి రిపోర్టర్ రాజేష్ గౌడ్ పై దాడి చేయడమే కాకుండా అక్రమంగా కేసులు బనయించడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, దాడులు, దోపిడీలపై ఈనెల 22న సిపిఐ ఆధ్వర్యంలో విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని, అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థి యువజన సంఘాలు కలిసి రావాలని కోరారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ఎన్.రసూల్, మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



పోటీలను ప్రారంభిస్తున్న శమంతకమణి

చెస్, క్యారమ్స్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు స్పోర్ట్స్

ఒలంపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న అంతర్ పాఠశాలల పోటీల్లో భాగంగా స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని కాంప్లెక్స్‌లో మంగళవారం జరిగిన చెస్, క్యారమ్స్ పోటీలను మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ శమంతక మణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెదడు చురుకుతనానికి చెస్ లాంటి క్రీడలు విద్యార్థులకు ఎంతో ఉపకరిస్తాయని అన్నారు. ఇలాంటి క్రీడలపై ఆసక్తి చూపాలని కోరారు. పోటీల అభివృద్ధికి తమ చారిటబుల్ ట్రస్ట్ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఒలంపిక్ అసోసియేషన్ నిర్వహణ కార్యదర్శి పి.సునీల్ కుమార్, సంయుక్త కార్యదర్శి అవినాష్ శెట్టి, చెస్ సంఘ ప్రతినిధులు రామ సుబ్బారెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

22న బహుమతుల ప్రధానోత్సవం

జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన అంతర్ పాఠశాలల పోటీలలో గెలుపొందిన విజేతలకు ఈ నెల 22న స్పోర్ట్స్ అథారిటీ అవుట్ డోర్ స్టేడియంలో ఒలంపిక్ పరుగు ముగింపు కార్యక్రమంలో పతకాలతో పాటు ట్రోఫీలను అందజేస్తారు. గెలుపొందిన విద్యార్థులు, పాఠశాలల ఉపాధ్యాయులు తమ పిల్లలతో పాటు రన్‌లో పాల్గొనాలని జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు.

రవీంద్ర కళాశాల విద్యార్థినికి సిఎం ప్రశంస

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రవీంద్ర మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న తాండ్రపాడు నారాయణ అక్షర ఇన్ఫ్లుఎన్షల్ స్టూడెంట్ అవార్డును ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ అవార్డు కింద రూ. 50 వేలు నగదు, ప్రశంసా పత్రం, మెమెంటోను విద్యార్థినికి సిఎం బహూకరించారు. యోగా విభాగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక అవార్డులు పొంది ఎందరితోనో ప్రశంసలు పొందుతూ మరెందరికో స్ఫూర్తిదాయనిగా నిలిచిన అక్షరను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి సత్కరించింది. విజయాన్ని అందుకున్న అక్షరకు రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకుడు జి.పుల్లయ్య, ఛైర్మన్ జి.వి.యం.మోహన్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మమతా మోహన్ శుభాకాంక్షలు తెలియజేశారు.



సిఎం చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న విద్యార్థిని అక్షర





గొల్ల భాస్కర్, గొల్ల లక్ష్మీ దంపతులు (ఫైల్), కాటు వేసి విష పురుగు

దంపతులను కాటేసిన విషపురుగు

- భార్య మృతి.. భర్త పరిస్థితి విషమం

ప్రజాశక్తి సి బెళగల్

మండలంలోని గుండ్రేవుల గ్రామంలో సోమవారం అర్ధరాత్రి మిద్దెపై పడుకున్న దంపతులను విషపురుగు కాటేసింది. వెంటనే కుటుంబ సభ్యులు వారిని వైద్యం నిమిత్తం కర్నూల్ సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ భార్య గొల్ల లక్ష్మి (35) మృతి చెందారు. భర్త గొల్ల భాస్కర్ (40) ఆరోగ్యం విషమంగా ఉన్నట్లు తెలిసింది. సోమవారం స్కూళ్లు తెరవగా ఇద్దరు కూతుళ్ళను, ఒక కుమారుడిని ఆయా హాస్టల్స్‌లో వదిలిపెట్టి వచ్చారు. ఒక్క రోజులోనే కుటుంబంలో విషాద సంఘటన చోటుచేసుకోవడం గ్రామంలో పలువురిని కంటతడి పెట్టించింది.

భూసార పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - తుగ్గలి

తుగ్గలిలోని పంట పొలాల్లో భూసార పరీక్షలను ఎంపీఈఓ స్రవంతి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలం ఉన్న ప్రతి ఒక్క రైతు కచ్చితంగా భూసార పరీక్షలను చేయించుకోవాలన్నారు. భూసార పరిశీలన వలన పంట మార్పిడి చేస్తే పంట దిగుబడి పెరుగుతుందన్నారు. భూసార పరీక్షలు చేయించుకోకుండా, పంట మార్పిడి చేయకుండా ఉంటే దిగుబడి పూర్తిగా తగ్గిపోయి తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



భూ పరీక్షలు చేస్తున్న ఎంపీఈవో



మాట్లాడుతున్న ఆర్‌డిఒ హరి ప్రసాద్

ఓటరు సర్వేను పూర్తి చేయాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - సి.బెళగల్

మండలంలో ఓటరు జాబితా సర్వేను సక్రమంగా పూర్తి చేయాలని ఆర్‌డిఒ హరి ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో ఏఈ ఆర్‌ఓ శేషఫణి అధ్యక్షతన సిబ్బందితో సమీక్షించారు. ఫారం 6, 6ఏ, 7, 8లకు సంబంధించి సుమారు 3300 వరకు ఓటరు జాబితాలో తప్పుల తడకగా ఉన్నట్లు తెలుస్తోందని, పక్కడ్బందీగా ఈ సర్వేను ఒక్క రోజులోనే పూర్తి చేయాలని ఆర్‌డిఒ ఆదేశించారు.

జనసేనలోకి 25 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - సి బెళగల్

మండలంలోని బ్రాహ్మణదొడ్డిలో గ్రామ పెద్దలు షబ్బీర్‌తో పాటు వడ్డే శ్రీను, రఫీ, వెంకన్న, ఖాజా, వడ్డే వెంకటేష్, మార్కు, బీటి శ్రీను, వడ్డే నాగేష్, సుంకన్న, చిన్న గిడ్డయ్య, సింహాద్రితో పాటు 25 కుటుంబాలు జనసేన పార్టీ మండల కన్వీనర్ మహబూబ్ సమక్షంలో మంగళవారం ఆ పార్టీలో చేరారు. భవిష్యత్తులో జనసేన ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన మండల నాయకులు, కార్యకర్తలు పోలిసి వెంకటేష్, అహ్మద్, డీజే వెంకటేష్, ఫరూక్, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.



జనసేన పార్టీలోకి చేరుతున్న దృశ్యం

రెవెన్యూ లీలలు...

- బీసీ సామాజిక వర్గ మహిళకు ఎస్సీ సర్టిఫికెట్
- లబ్ధి పొందిన పథకాల్లో వేర్వేరు కులాలు

ప్రజాశక్తి-ఆలూరు

'పైసలిస్తే ఏమైనా చేస్తాం' అంటూ కొందరు రెవెన్యూ అధికారులు లేని భూమి ఉన్నట్లు ఆన్‌లైన్‌లో ఎక్కించేస్తున్నారు. ఇప్పుడు ఏకంగా కులాలను మారుస్తూ తప్పుడు సర్టిఫికెట్లను మంజూరు చేస్తున్నారు. గత కొన్నాళ్లుగా ఆలూరు తహశీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతికి అడ్డు, అదుపు లేకుండా పోతోంది.

తప్పుడు కుల సర్టిఫికెట్ మంజూరు

మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ భర్తతో గొడవపడి పిల్లలతో కలిసి ఆలూరులో కాపురం ఉంటున్నారు. భర్తతో గొడవ పడిన సమయంలో పోలీసు స్టేషన్‌కు తిరిగే క్రమంలో కుల సంఘానికి చెందిన నాయకునితో బంధం ఏర్పడింది. కులసంఘం నాయకుని పలుకుబడితో ఏకంగా బీసీ సామాజిక మహిళకు ఎస్సీ సర్టిఫికెట్‌ను మంజూరు చేయించారు. గ్రామ సచివాలయంలో పని చేసే విఆర్‌ఒ సహకారంతో రెవెన్యూ అధికారులు మామూళ్లకు తలొగ్గడంతో సర్టిఫికెట్ మంజూరయినట్లు తెలిసింది. ఓ వైపు ఎస్సీ సర్టిఫికెట్ పొందిన మహిళ గతేడాది వైఎస్ఆర్ చేయూత పథకం, ఒంటరి మహిళ పింఛను పథకంలో ఎస్సీ సామాజిక కులం పేరుతో, ఇల్లు మంజూరులో మాత్రం బీసీ సామాజిక పేరుతో ఇలా వివిధ పథకాల్లో వేర్వేరుగా ఉండడం చూస్తే అధికారుల పని ఏవిధంగా ఉందో అర్థమవుతోంది.



ఆలూరు తహశీల్దార్ కార్యాలయం

అక్రమాలకు కేరాఫ్ రెవెన్యూ కార్యాలయం...

మండలంలోని మొలగవల్లి గ్రామంలో గతేడాది లేని భూములను ఇతరులకు ఆన్‌లైన్‌లో ఎక్కించిన సంఘటనలో తహశీల్దార్, సచివాలయ విఆర్‌ఒ, కంప్యూటర్ ఆపరేటర్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే ప్రతి పనికీ ఓ రేటు ప్రకారం వసూలు చేస్తూ ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అవినీతికి కేరాఫ్ అయిన తహశీల్దార్ కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

ప్రజాశక్తి - మంత్రాలయం


బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు

మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు హంపయ్య ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమంలో పారితోషికం విడుదల చేసింది. మంగళవారం నగదు ప్రోత్సాహకాన్ని విద్యార్థులకు అందజేశారు. ఇటీవల జరిగిన పదో తరగతి ఫలితాల్లో పాఠశాల స్థాయిలో 523 మార్కులు సాధించిన పూజారి అశ్విని మొదటి స్థానంలో నిలవగా ప్రథమ బహుమతి కింద రూ.3 వేలు, ద్వితీయ బహుమతి 496 మార్కులు సాధించిన డి.ఉమేష్ రూ.2 వేలు, తృతీయ బహుమతి 482 మార్కులు సాధించిన డి.వీరేంద్రకు రూ.1000తో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు రామన్న, విఠోబరావు పాల్గొన్నారు.

ఘనంగా తారకనాథ్ వర్ధంతి వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

భారతీయ స్టేట్ బ్యాంకు స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ నేత వై.తారకనాథ్ 19వ వర్ధంతి వేడుకలను ఆదోని మెయిన్ బ్రాంచిలో రీజనల్ సెక్రటరీ కె.రవికుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.రాజశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రతేడాది మాదిరిగా సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ఆదోని పట్టణంలోని ఫెయిత్ హోమ్ అనాథ పిల్లలకు మిక్సర్ గ్రైండర్, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. స్టేట్ బ్యాంకులో పని చేస్తున్న తాత్కాలిక ఉద్యోగులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఆదోని బ్రాంచి చీఫ్ మేనేజర్ అబ్దుల్ రావూఫ్, బ్రాంచి లోకల్ సెక్రటరీ లక్ష్మీ, సిఎసి బ్రాంచి లోకల్ సెక్రటరీ సి.హుస్సేని, యూనియన్ సభ్యులు మల్లేష్, జయరాం, నాగేంద్ర, రాజేశ్వరి, లక్ష్మి అపర్ణ, సురేంద్ర, జగన్, రవి ప్రకాష్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

- తాగిన మత్తులో పట్టపగలే దాడి

ప్రజాశక్తి - ఆదోని

కోలుకోలేక వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం ఆదోనిలో చోటు చేసుకుంది. పట్టణంలోని ఎమ్మిగనూరు బైపాస్ సమీపంలో మండగిరి పంచాయతీకి చెందిన శంకర్ (40) స్నేహితులతో సోమవారం సాయంత్రం మద్యం తాగి గొడవ పడ్డారు. ఘర్షణలో గాయపడిన శంకర్‌ను ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మంగళవారం చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు సమాచారం. శంకర్‌పై గుర్తుతెలియని వ్యక్తి విచక్షణా రహితంగా ఆయుధాలతో దాడి చేసిన దృశ్యం సోషల్ మీడియాలో వైరల్ అయింది. పట్టపగలే ప్రధాన రోడ్డులో ఆయుధాలతో దాడి చేస్తున్నా పక్కనే జనం ఉన్నా ఒక్కరు కూడా సర్ది చెప్పే ప్రయత్నం చేయలేదని పలువురు తెలిపారు. ఘటనపై పోలీసులు చేపట్టిన విచారణలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఎంఇఒకు యుటిఎఫ్ నేతల అభినందనలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్


ఎంఇఒ వనజ కుమారిని సన్మానిస్తున్న నాయకులు

కల్లూరు మండల విద్యాశాఖ అధికారి-2గా బాధ్యతలు చేపట్టిన వనజ కుమారిని మంగళవారం యుటిఎఫ్ నేతలు కలిసి అభినందనలు తెలియజేశారు. జిల్లా సహ అధ్యక్షులు రవికుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి హేమంత్ కుమార్, జిల్లా పూర్వ సహాధ్యక్షులు రఫిక్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనిల్ కుమార్, వెంకటేష్ జిల్లా కౌన్సిలర్ సురేష్‌లు వనజ కుమారిని శాలువా, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. కల్లూరు మండలంలో నెలకొన్న విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని యుటిఎఫ్ నేతలు కోరారు. అలాగే కల్లూరు మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులును కూడా సన్మానించారు.

పురుగుమందు తాగి యువకుడు మృతి

నందవరం : నందవరం గ్రామానికి చెందిన పరంపొగు లక్ష్మణ్ అలియాస్ అనోక్ (31) పురుగుమందు తాగి మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు... అనోక్ రోజువారీగా రాత్రి పడుకున్నారు. ఉదయం మృతుని తల్లి వెళ్లి చూడగా నోట్లో నురగ ఉండడంతో గట్టిగా కేకలు వేశారు. ఇంటి పక్కన వారు వచ్చి చూడగా అప్పటికే మృతి చెందారు. సమాచారం అందడంతో వెళ్లి చూసి కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. అనోక్ అక్క మాత్రం మృతిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడు అనోక్ నడుముపై రక్తపు మరకలు ఉన్నాయని, ఆత్మహత్య చేసుకొనే పరిస్థితి అనోక్ లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఒకవేళ ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంటే అనోక్ పక్కనే ఉన్న భార్య కదలికలను గమనించలేదా అని కొంతమంది కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరి అనోక్‌ది హత్య లేక ఆత్మహత్య అనేది పోలీసు విచారణ తెలియాల్సి ఉంది. మృతునికి తల్లి, భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలందరికీ లబ్ధి

- వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సంక్షేమ పథకాలతో పేదలందరికీ లబ్ధి చేకూరిందని వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని 31వ వార్డు సచివాలయంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను, వాటి ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. వార్డు పరిధిలోని కొన్ని వీధుల్లో తాగునీటి సమస్య, సిసి రోడ్లు తదితర సౌకర్యాలు కల్పించాలని ప్రజలు ఆయన దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. ఈ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం అన్ని వార్డుల్లో ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. పట్టణంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేయాలని ఒక ప్రణాళిక మేరకు సిసి రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలను చేపడుతున్నామని చెప్పారు. గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి ఎఐఐబి స్కీం కింద మంజూరైన రూ.142 కోట్లతో పైపులైన్లు, ట్యాంకు నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. అవి పూర్తయితే ఇంటింటికీ కుళాయిలు మంజూరు కానున్నట్లు వివరించారు.


సంక్షేమ పథకాల లబ్ధి పత్రాలను అందజేస్తున్న జగన్మోహన్ రెడ్డి

అక్రమంగా మోటార్లు పెడితే చర్యలు : ఇరిగేషన్ డిఇ

ప్రజాశక్తి - చిప్పగిరి

తుంగభద్ర జలాశయ విభాగంలోని, ఆలూరు బ్రాంచి కాలువపై అనధికారికంగా మోటార్లు పెట్టి సాగునీటి జలచౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ డిఇ మంజునాథ్, తహశీల్దార్ లక్ష్మీనారాయణ రైతులకు తెలిపారు. మంగళవారం ఎంపిపి జూటూరు హేమలత మారయ్య ఆధ్వర్యంలో ఇరిగేషన్ అధికారులు, ఆలూరు బ్రాంచి కెనాల్ ఆయకట్టు రైతులతో కలిసి చిప్పగిరి, ఏరూరు, మల్లికార్జున పల్లె, డేగలహాలు గ్రామాల్లో పర్యటించారు. రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇ మంజునాథ్, తహశీల్దార్ లక్ష్మీనారాయణ మాట్లాడారు. ఆగస్టులో ఆలూరు బ్రాంచి కెనాల్‌కు నీరు విడుదల అవుతున్నట్లు తెలిపారు. కాలువపై అనధికారికంగా రైతులు అక్రమమైన మోటార్లు పెట్టి నీటి చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకొని, అలాంటి రైతులపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం కొంతమంది రైతులు వారి పొలాల్లో పైపులైన్లు వేసుకున్నారని, వారిని అడిగే హక్కు తమకు లేదని తెలిపారు. ఎప్పుడైతే కాలువలో పైపులేసి సాగునీరు పంపిణీ చేస్తారో అప్పుడు కాలువపై పర్యటించి, మోటార్లను కూడా ధ్వంసం చేస్తామని, ముందే రైతులకు తెలియజేస్తున్నట్లు చెప్పారు. రైతులు సహకరించి నిబంధనలు పాటించాలని కోరారు. ఎబిసి కాలువ కింద ఉన్న ఆయకట్టు రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు, కాలువకు నీటి పంపిణీ జరుగుతుందన్నారు. ఆలూరు బ్రాంచి కెనాల్ ఎఇ తిమ్మారెడ్డి, డేగలహాల్ సర్పంచి నీలకంఠ, రైతులు పోతన్న, ధనుంజయ, లాల్ స్వామి, లింగన్న పాల్గొన్నారు.


కాలువపై పర్యటించి రైతులతో మాట్లాడుతున్న అధికారులు

వైద్యులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు

- విధులకు డుమ్మా కొట్టిన వైద్యులపై సబ్ కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి - ఆదోని

డివిజన్ కేంద్రమైన ఆదోని ఏరియా ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సదుపాయం అందుబాటులోకి తెచ్చేందుకు అవకాశాలు నిండుగా ఉన్నాయి. అక్కడ రోగులు పడుతున్న ఇబ్బందులను ఇటీవల పత్రికలు ప్రచురించాయి. సమస్యలను, రోగులు పడుతున్న ఇబ్బందులను కళ్లకు కట్టినట్లు ప్రచురించడంతో ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ స్పందించారు. మంగళవారం సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆస్పత్రిని సందర్శించారు. ఆ సమయంలో డ్యూటీలో డాక్టర్లు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. వైద్యులు పద్ధతి మార్చుకోవాలని పలుసార్లు సూచించినప్పటికీ విధులకు డుమ్మా కొడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ వివరించారు. రోగులకు వడ్డిస్తున్న భోజనాన్ని రుచి చూశారు. నాణ్యత ప్రమాణాలు లేకపోవడంతో ఇలాగే వడ్డిస్తే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. రోగుల వార్డులోని మరుగుదొడ్లను పరిశీలించారు. నీటి సౌకర్యం, పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహిస్తున్నారా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. పాము, తేలు కాటుకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయా అంటూ ఫార్మాసిస్టును అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని పలుమార్లు సూచించినప్పటికీ ఆస్పత్రి వైద్యులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అంతు పట్టడం లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఆస్పత్రి అంతా కలియదిరిగి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, లేకపోతే వేరే ప్రాంతానికి ట్రాన్స్‌ఫర్ చేయించుకోండని ఉద్యోగులకు సూచించారు. ఇదే విషయంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్నను మీడియా వివరణ కోరగా... ప్రస్తుతం వైద్యులు బదిలీల ప్రక్రియ ఉందని, లాంగ్ స్టాండ్ ఉన్న వారిని మార్చుతామని తెలిపారు. తాను కూడా సెలవులో ఉన్నానని, ఈ విషయాన్ని సబ్ కలెక్టర్‌కు వివరించానని చెప్పారు. సబ్ కలెక్టర్ వెంట డాక్టర్ ఆది నాగేష్ ఉన్నారు.


పరిసరాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

రిజిస్ట్రేషన్‌ను త్వరగా పూర్తి చేయండి

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించిన సబ్ కలెక్టర్

ఆదోనిరూరల్ : సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గ్రామ సచివాలయం పరిధిలో జరుగుతున్న క్రయ, విక్రయాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు సేవలు అందించేందుకు, భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయంలోనే సేవలు అందిస్తోందని తెలిపారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జగనన్న భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా మొదటి విడతలో ఆదోని డివిజన్‌లో 57 గ్రామాల్లో 1.20 లక్షల పై చిలుకు ఎకరాలు రీసర్వే పూర్తి చేసుకున్న భూములకు గ్రామ సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైందని తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ రాజశేఖర్, ఆదోని రీసర్వే ఉప తహశీల్దార్ పెద్దయ్య పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్


కర్ణాటక మంత్రిని పూలమాలతో సన్మానిస్తున్న రామయ్య

మాజీ ఎమ్మెల్యేను కలిసిన కర్ణాటక మంత్రి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కర్ణాటక రాష్ట్ర మంత్రి హెచ్‌కె.పాటిల్ స్థానిక మాజీ ఎమ్మెల్యే రామయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆషాఢమాసం సందర్భంగా మంగళవారం కర్ణాటక మంత్రి హెచ్‌కె.పాటిల్ కుల దైవమైన రేణుక ఎల్లమ్మ కొండమీది గుడిని సందర్శించారు. పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకుని, శ్రీమహాయోగి లక్ష్మమ్మ దేవాలయాన్ని దర్శించుకుని, మాజీ ఎమ్మెల్యే రాచోటి రామయ్య స్వగృహానికి వెళ్లి ఆయనతో మాట్లాడారు. పాటిల్‌ను రామయ్య శాలువా కప్పి పూలమాలతో సన్మానించారు. అనంతరం రామయ్య స్వగృహంలో మంత్రి, ఆయన కుటుంబ సభ్యులతో కలిసి అల్పాహార విందులో పాల్గొన్నారు. రాచోటి సుబ్బయ్య, బ్యాంకు సిఇఒ గట్టు మురళీ కుమార్, ఉపాధ్యక్షులు లక్ష్మణయ్య శెట్టి, శ్రీనివాసులు, హుస్సేన్ అహ్మద్, అశ్వత్ నారాయణ, దినకర్ పాటిల్, సురేష్ గుప్త, ప్రభాకర్ రెడ్డి, హనుమంతు రెడ్డి, ఆర్ఎంజి.రెడ్డి, అడ్వకేట్ బద్రినాథ్, టి.రవీంద్ర పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - కోసిగి రూరల్

మండలంలోని కోల్మాన్‌పేట గ్రామానికి చెందిన యువ నాయకులు ఉప్పలపాటి అర్జున్ మంగళవారం బాధితులకు ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని కందుకూరు గ్రామంలో విద్యుదాఘాతంతో హరిజన అంజనయ్య దంపతుల గుడిసె ఖాళీ బూడిదైంది. తనవంతుగా ఆ దంపతులకు 25 కిలోల బియ్యం బస్తా, రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే మండలంలోని చిన్న భూంపల్లి గ్రామంలో అప్పులబాధతో మహిళ రైతు కుల్దీ నాగలక్ష్మి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆమె కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయా కుటుంబ సభ్యులు, స్నేహితులు రాయచూరు రామకృష్ణ, వందగల్లు నరసింహులు, కొండగేని ఉరుకుంద, మదిరి పవన్ కుమార్ , శివరాం, ముల్లా ఖాసీం, మదిరి నరసింహ పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి

- సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

పెరిగిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు తిప్పన్న, నాయకులు కృష్ణమూర్తి, అజీం ఖాన్, గోవిందు, ఇక్బాల్ డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో షాప్ టు షాప్, మున్సిపల్ మెయిన్ రోడ్డులో ఉన్న కరెంట్ బిల్లు చెల్లింపు కేంద్రం వద్ద ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సర్దుబాటు చార్జీల విధానం రద్దు చేయాలని, ట్రూ అప్ సర్దుబాటు చార్జీలను నిలిపివేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టరాదని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా చేపట్టే ఆందోళనలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. **ఆదోని(రూరల్)** మండలంలోని పాండవగల్ గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న మాట్లాడారు. ఈ మధ్యనే వామపక్షాల ఆధ్వర్యంలో ఒక సదస్సు జరిగిందని, 10 వామపక్ష పార్టీలు కలిసి ఈనెల 30న విద్యుత్ కార్యాలయాల దగ్గర ఆందోళనకు పిలిపిచ్చాయని తెలిపారు. సిపిఎం శాఖ కార్యదర్శి కె.పాండురంగ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు : విద్యుత్ చార్జీల భారాలపై ప్రజలు మరో పోరాటానికి సన్నద్ధం కావాలని సిపిఎం తాలూకా నాయకులు హనుమంతు, రాముడు కోరారు. స్థానిక సుందరయ్య భవన్‌లో విద్యుత్ చార్జీల పెంపునకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యుత్ చార్జీలను ఐదేళ్లలో పెంచబోమని హామీ ఇచ్చి ఓట్లు దండుకున్నారని, రాష్ట్రంలో ట్రూఅప్ పేరుతో చార్జీల భారం వేస్తున్నారని చెప్పారు. అలాగే శ్లాబ్ పేరుతో ప్రజలపై మరో భారాన్ని మోపారన్నారు. బిల్లులో విద్యుత్ భారం కంటే అనేక రకాల చార్జీల భారం ఎక్కువయిందన్నారు. అదనపు చార్జీలను వెనుకకు తీసుకోకపోతే ప్రజలు మరో విద్యుత్ పోరాటానికి సన్నద్ధం కావాలని కోరారు. సిపిఎం నాయకులు లక్ష్మీ నరసయ్య, ఎంపి.రాజు, వెంకటేష్, అబ్దుల్లా, బి.రాజు, ఆంథోని, వెంకటేశ్వర్లుశెట్టి, కాలప్ప, రోషన్న, విజయ్, కొండన్న పాల్గొన్నారు.


ఆదోనిలో కరపత్రాలు ఇచ్చి ప్రచారం చేస్తున్న నాయకులు

టిడిపితో లబ్ధి పొంది విమర్శించడం తగదు

- టిడిపి మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్

ప్రజాశక్తి - దేవనకొండ


సమావేశంలో మాట్లాడుతున్న విజయ భాస్కర్ గౌడ్

టిడిపిలో అనేక పదవులు చేపట్టి లబ్ధి పొందిన కప్పట్రాళ్ల వెంకటప్ప నాయుడు కుమార్తె, ఆస్పరి మాజీ జడ్‌పిటిసి బొజ్జమ్మ టిడిపిని విమర్శించడం తగదని టిడిపి నాయకులు తెలిపారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, మండల నాయకులు ఉచ్చీరప్ప, బడిగింజల రంగన్న, రామారావు నాయుడు, రాజశేఖర్ గౌడ్, ఆకుల వీరేష్ మాట్లాడారు. టిడిపి ప్రభుత్వంలో బొజ్జమ్మ కుటుంబం నాలుగు సార్లు ఎంపిపి, రెండుసార్లు జడ్‌పిటిసి, రెండు సార్లు కో ఆపరేటివ్ చైర్మన్ పదవులు చేపట్టారని తెలిపారు. పదవులు చేపట్టి టిడిపిపై బురదజల్లడం సమంజసం కాదన్నారు. వ్యక్తిగత విషయాలతో ఫ్యాక్షన్ గొడవలు పెట్టుకొని కోట్ల కుటుంబాన్ని విమర్శించడం తగదని హెచ్చరించారు. స్వలాభం కోసం వైసిపిలోకి వెళ్లి టిడిపిని విమర్శిస్తే సహించేది లేదన్నారు. సొంత పలుకుబడితో అన్ని పదవులూ గెలిచి ఉంటే సొంత గ్రామంలో సర్పంచిగా ఎందుకు ఓడిపోయారని ప్రశ్నించారు. టిడిపి మండల నాయకులు మల్లికార్జున గౌడ్, వెంకటస్వామి గౌడ్, రాజాసాబ్, రాజగోపాల్ గౌడ్, చాంద్ బాషా పాల్గొన్నారు.

విచ్చలవిడిగా గుట్కా అమ్మకాలు...

- గుట్కాకు బానిసలై అనారోగ్యం పాలవుతున్న యువకులు - చోద్యం చేస్తున్న సంబంధిత అధికారులు

ప్రజాశక్తి - హొళగుంద

హొళగుంద మండలంలో గుట్కా ప్యాకెట్ల అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. గుట్కాకు బానిసలై యువకులు అనారోగ్యం పాలవుతున్నారు. గుట్కా ప్యాకెట్ల అమ్మకాలను అరికట్టాల్సిన సంబంధిత అధికారులు చోద్యం చేస్తున్నారు.

హొళగుంద నుంచి 5 కిలోమీటర్ల దూరంలో కర్ణాటక సరిహద్దు ఉండడంతో అధిక సంఖ్యలో గుట్కా ప్యాకెట్ల రవాణా జరుగుతున్నట్లు సమాచారం. ఇక్కడ ఏ దుకాణానికి వెళ్లినా తాగడానికి నీరు దొరుకుతుందో, లేదో కానీ గుట్కా ప్యాకెట్లు మాత్రం దర్శనమిస్తాయి. అధికారులకు తెలిసినా తూతూమంత్రంగా దాడులు నిర్వహించి అక్కడక్కడ 1, 2 కేసులు కట్టి చేతులు దులుపుకుంటున్నట్లు మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. గుట్కా ప్యాకెట్ల అమ్మకాల వల్ల వ్యాపారులకు అధిక సంఖ్యలో లాభాలు వస్తున్నా, ఎక్కువ శాతం కార్మికులు, యువకులతో పాటు యువతులు, మధ్య తరగతి మహిళలు సైతం బానిసైనట్లు తెలిసింది. నోటి క్యాన్సర్‌తోపాటు రక్తహీనత, మతిస్థిమితం కోల్పోవడం వంటి సమస్యలు వచ్చి చేరుతున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నా యువత పెడచెవిన పెడుతున్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి 30 గుట్కా సీట్లు గల ఒక బాక్స్‌ను రూ.100 ప్రకారం కొనుగోలు చేసి రూ.150 నుంచి రూ.200 వరకు వ్యాపారులు అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

రాష్ట్రాల మధ్య కలిన చర్యల అమలులో తేడాలు

గుట్కా, మత్తు పదార్థాల కార్యకలాపాలపై కఠిన చర్యలు అమలు చేయడంలో రాష్ట్రాల మధ్య తేడాలు ఉండడం వల్ల గుట్కా, మత్తు పదార్థాల అమ్మకందారులు చెలరేగిపోతున్నట్లు సమాచారం. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆదాయమే ధ్యేయంగా పని చేయడం, ఒక రాష్ట్రం గుట్కా అమ్మకాలు చట్ట విరుద్ధం, నిషేధమంటూ ఆదేశాలు జారీ చేస్తున్నాయి.



మరో రాష్ట్రం గుట్కా, మత్తు పదార్థాల వల్ల అధిక లాభాలు ఆర్జించవచ్చని భావించడం వల్ల యువతతో పాటు మహిళలు కూడా అనారోగ్యం పాలవుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

ఏ రాష్ట్రం కూడా గుట్కా, మత్తు పదార్థాలను అమ్మి లాభాలను ఆర్జించకూడదని కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. పక్కన కర్ణాటక రాష్ట్రంలో గుట్కా ప్యాకెట్లు అమ్ముకోవచ్చని ఆదేశించడం వల్ల బహిరంగంగా మార్కెట్‌లో అమ్మకాలు జరుగుతున్నాయి. ఆంధ్ర రాష్ట్రంలో గుట్కా, మత్తు పదార్థాలు నిషేధించడం వల్ల రహస్యంగా అమ్మకాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుట్కా వ్యాపారులపై ఉక్కు పాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే

పథకాలను సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తుగ్గలి

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సభ్యులు చేసుకోవాలని పత్తికొండ శాసనసభ్యులు శ్రీదేవి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాంపల్లి గ్రామంలో గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమం స్థానిక నాయకులు నాగభూషణం రెడ్డి, సర్పంచ్ మనేంద్ర, జుటూర్ రాజు, కోటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు జగనన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రామచంద్రారెడ్డి, రాతన మోహన్ రెడ్డి, తుగ్గలి మోహన్ రెడ్డి, వక్ బోర్డు డైరెక్టర్ టిఎండి ఉసేని, సొసైటీ చైర్మన్ అట్లా గోపాల్ రెడ్డి, ఎంపీటీసీ, మండల కమిటీ అధ్యక్షులు జిట్టా నాగేష్ యాదవ్, సచివాలయం మండల కన్వీనర్ హనుమంతు, వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, తుగ్గలి చంద్రశేఖర్ రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, ఈశ్వర రెడ్డి, రవి కుమార్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు తీరాలంటే టిడిపి రావాల్సిందే

- టిడిపి కర్నూల్ ఇంచార్జ్ టిజి భరత్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ప్రజల సమస్యలు తీరాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాల్సిందేనని కర్నూలు నియోజకవర్గ ఇన్చార్జి టిజి భరత్ అన్నారు. మంగళవారం కర్నూలు నగరంలోని 14వ వార్డు పరిధిలోని బుధవారపేటలో భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో టీజీ భరత్ వార్డు పర్యటన చేపట్టి ప్రజలను కలిశారు. ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ఏం మేలు చేస్తుందో ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. టిడిపి మొదటి విడత మేనిఫెస్టోను మహిళలు, యువతకు తెలిపారు. దీంతోపాటు టిజీవి సంస్థల ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత వైద్య పరీక్షల కరపత్రాలను ప్రజలకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వస్తే మహిళలు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలకు మంచి జరుగుతుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జకియా అక్సారి, టిడిపి నేతలు అబ్బాస్, ముంతాజ్, రామాంజనేయులు, రాజు, కరీముల్లా, యాసిన్ పీరా, షబ్బీర్, షేకు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


14వ వార్డులో పర్యటిస్తున్న టీజీ భరత్

మెప్మా పొదుపు మహిళలు, ఆర్‌పిల

సమస్యలు పరిష్కరించాలి : ఐద్వా

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మెప్మా పొదుపు మహిళలు, ఆర్‌పిల సమస్యలు పరిష్కరించాలని ఐద్వా జిల్లా నేతలు ఎన్.అలివేలు, కె.అరుణ, జి.ధనలక్ష్మిలు మెప్మా ఎండి విజయలక్ష్మిని కోరారు. మంగళవారం కర్నూల్‌లో మహిళా మార్ట్ ప్రారంభానికి విచ్చేసిన మెప్మా ఎండి విజయలక్ష్మిని వారు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొదుపు గ్రూపులకు మొదటి, రెండవ విడత రుణమాఫీలు వచ్చి మూడవ విడత రుణమాఫీలో రాని గ్రూపులు ఉన్నాయని, 0 వడ్డీ 3 లక్షలకు పరిమితం కాకుండా తీసుకున్న బ్యాంకు లింకేజీ రుణం మొత్తానికి వర్తింపచేయాలన్నారు. గ్రూపు సభ్యులు చాలామంది టైలరింగ్ వృత్తి చేస్తున్నారని, జిల్లాలోని కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని కేంద్రాలలో రెడీమేడ్ వస్త్రాల పరిశ్రమను స్థాపించాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో సున్నపురాయి విస్తారంగా లభ్యమవుతుంది కావున చాక్ పీసులు తయారీలో మహిళలకు శిక్షణ ఇచ్చి కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. తయారీ అయిన చాక్ పీసులను ప్రభుత్వ పాఠశాలలకు, కళాశాలలకు సరఫరా చేస్తూ మహిళలకు ఉపాధి కల్పిస్తే ఆర్థికంగా ఎదుగుతారని అన్నారు. ఆర్పీలకు గ్రామీణ ప్రాంతాల్లో వివోఏలకు ఇచ్చే వేతన పద్ధతిని అమలు చేయాలని, సర్వర్ ప్రాబ్లం ఉన్నప్పుడు ఆర్పి గ్రూపులకు అటెన్ చేస్తున్న పెండింగ్లో ఉంటాయని, వేతనం కట్ అవుతుందని, నెల వేతనం 8 వేలు అకౌంట్లో వేయాలన్నారు. ఆర్పిలకు ఎస్ఎల్ఎఫ్, టిఎల్ఎఫ్ సమావేశాల కోసం ప్రతి నియోజకవర్గంలో పొదుపు భవనాలను నిర్మించాలన్నారు. ఆర్పీలకు ప్రత్యేక లాగిన్ ఇవ్వాలని కోరారు.


వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా నేతలు

ఆరోగ్య శ్రీకి డబ్బు వసూలు చేస్తే చర్యలు

- జిల్లా కలెక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్య శ్రీ పథకం కింద వైద్యం అందిస్తున్న నిరుపేదలతో డబ్బులు వసూలు చేసే ప్రైవేట్ ఆసుపత్రులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి సృజన వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు డిస్ట్రిక్ట్ డిసిప్లెనరి కమిటీతో ఆరోగ్యశ్రీ అంశంపై ప్రైవేట్ నెట్వర్క్ ఆసుపత్రులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం పొందిన వారి నుండి వచ్చిన ఫిర్యాదుల మేరకు ప్రైవేట్ నెట్వర్క్ ఆసుపత్రులతో, డిస్ట్రిక్ట్ డిసిప్లెనరి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి విచారించామన్నారు. ఆరోగ్య శ్రీ కింద నాణ్యమైన వైద్య సేవలు పూర్తి స్థాయిలో ప్రజలకు అందించాలని 47 నెట్వర్క్ ఆస్పత్రుల యాజమాన్యలను అదేశించారు. ఇందులో పది ఆసుపత్రుల నుండి ఆరోగ్యశ్రీ పథకం అమలు చేస్తూ వైద్యం చేయించుకున్న వారి నుండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు 19 గ్రీవెన్స్ వచ్చాయన్నారు. 19 మంది బాధితుల నుండి రూ.1,14,500 వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందాయని, ఈ అంశంపై సంబంధిత ఆసుపత్రి వారిని ఆరా తీయగా వారి నుండి వచ్చిన సమాధానం సరిగా లేనందున, ఫిర్యాదులు అందిన 10 ఆసుపత్రులకు రూ.5,72,500 పెనాలిటీ వేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ రామ గిడ్డయ్య, డిసిహెచ్ఎస్ శ్రీనివాసరావు, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రఘు, ప్రైవేట్ నెట్వర్క్ ఆసుపత్రిల ప్రతినిధులు పాల్గొన్నారు.



విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వెల్దుర్తి

వెల్దుర్తి మండలం లక్ష్మీనగరం గ్రామంలో విద్యుత్ షాక్ కొట్టి వడ్డే జగదీష్(22) మంగళవారం మృతి చెందాడు. వడ్డే జగదీష్ ఇంట్లో విద్యుత్ బల్బు మారుస్తుండగా కరెంట్ షాక్ తగిలి స్పృహ కోల్పోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆటోలో వెల్దుర్తి ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. అప్పటికే చనిపోయినట్లు ఆసుపత్రి వైద్యాధికారి నిర్ధారించారు. వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

డిసిసి కార్యదర్శులుగా ఇద్దరు నియామకం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శులుగా యస్ రియాజుద్దీన్, షేక్ ఎజాజ్ అహ్మద్ నియమితులయ్యారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎం.సుధాకర్ బాబు వీరిద్దరికీ మంగళవారం నియామక పత్రాలు అందజేశారు. యస్ రియాజుద్దీన్, షేక్ ఎజాజ్ అహ్మద్ మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేస్తామని తెలియజేశారు.

22 నుండి అవగాహన సదస్సులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : నూతన విద్యా విధానం అమలులో భాగంగా డిగ్రీ కోర్సులో సింగిల్ మేజర్ విధానంపై 22 నుండి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు రాయలసీమ యూనివర్సిటీ అకాడమిక్ అఫైర్స్ ఎన్టికె నాయక్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 22న డోన్‌లో, 24న కర్నూలు, నంద్యాల, ఆదోని ప్రాంతాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు అందరూ హాజరు కావాలని పేర్కొన్నారు.

సచివాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ

- పకడ్బందీగా నిర్వహించండి : జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభమయ్యాయిని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ నిశాంతి.టి పేర్కొన్నారు. మంగళవారం నంద్యాల మండలంలోని బిల్లాలపురం గ్రామ సచివాలయంలో జరుగుతున్న భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఆమె పరిశీలిస్తూ సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్ సేవలను అందుబాటులోకి తెచ్చిందని ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను గురించి ఆమె అడిగి తెలుసుకుంటూ నిర్ణీత కాల వ్యవధిలోగా అర్జీదారులకు పరిష్కార మార్గాలు చూపాలని సిబ్బందిని ఆదేశించారు. దేశంలో ఇప్పటివరకు ఎక్కడా లేని విధంగా, మన రాష్ట్రంలో సచివాలయాల్లో అందుబాటులోకి వచ్చిన భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సచివాలయాల్లో అన్ని రకాల దస్తావేజులు, వ్యవసాయ భూములు, వీలునామాలు, దత్తత మొదలైన రిజిస్ట్రేషన్లను చేసుకోవచ్చునని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. నంద్యాల ఆర్డీవో శ్రీనివాసులు, జిల్లా రిజిస్ట్రార్ చెన్నకేశవరెడ్డి, సబ్ రిజిస్ట్రార్ సునంద, పిఓఎల్ఆర్ డిటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - గడివేముల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకం సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని మంచాలకట్ట గ్రామంలో బుధవారం నుండి రీ సర్వే ప్రారంభిస్తున్నామని చెప్పారు.

సచివాలయాన్ని ఎంపిడిఓ తనిఖీ

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని పెద్దబోధనం సచివాలయాన్ని ఎంపిడీఓ మహబూబ్ దౌలా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను తనిఖీ చేసారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని,సచివాలయాలకు వచ్చే వారితో సభ్యతగా ప్రవర్తించాలని ఎంపిడిఓ సిబ్బందిని కోరారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సబియా,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బంది కి సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ

ఆర్‌బికెల్లో ఎరువులు : ఎఓ

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ఆయా రైతు భరోసా కేంద్రాలలో రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని ముత్తలూరులోని రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతు భరోసా కేంద్రంలో రికార్డ్స్ లను పరిశీలించారు. సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలన్నారు. ముత్తలూరు రైతు భరోసా కేంద్రంలో డిఏపి, యూరియా, అందుబాటులో ఉన్నాయని కావల సిన రైతులు సిబ్బందిని సంప్రదించి కొనుగోలు చేయవచన్నారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణ అధికారి రాజు సిబ్బంది ఉన్నారు.


పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ

ప్రజాశక్తి - చాగలమర్రి


మండలంలోని డి.వనిపెంట, ముత్యాలపాడు గ్రామాలకు చెందిన సంజీవయ్య, పుల్లమ్మ, ఉప్పలపాటి నడిపి వెంకటపతి, గురప్పలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మతుల కుటుంబాలను మంగళవారం మాజీ మంత్రి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమా అఖిలప్రియ పరామర్శించి తమ ప్రగాడ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి,టిడిపి నాయకులు గోపాల్, రంగనాయుడు, దస్తగిరి, పాములేటి, ఇండ్ల లక్ష్మిరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డి.వనిపెంటలో సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి

జూలై నుండి రేషన్‌లో రాగులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

నియోజకవర్గంలోని రేషన్ కార్డుదారులకు జూలై నెల నుండి పిడిఎస్ బియ్యానికి బదులుగా మూడు కిలోల రాగులను ఉచితంగా అందజేస్తున్నట్లు సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ సోమశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ నెలనెలా రేషన్ కార్డుదారులకు ఇచ్చే పిడిఎస్ బియ్యాన్ని ఎవరికైనా విక్రయిస్తే అట్టి వారి రేషన్ కార్డును తొలగిస్తామ న్నారు. పిడిఎస్ బియ్యాన్ని ఎవరు కొనరాదన్నారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని రేషన్ కార్డుదారులకు కార్డుకు కిలో 16 రూపాయలకే గోధుమ పిండి అందజేస్తామన్నారు.


సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్ సోమశేఖర్ రెడ్డి

ఘనంగా మాజీ మంత్రి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర జన్మదిన వేడుకలను మంగళవారం కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లోని పార్టీ కార్యాలయంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేష్ గౌడ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ కొల్లు రవీంద్ర బిసిల అభివృద్ధికి రాష్ట్రమంతా బిసి గళం, బస్సు యాత్ర, బిసి పోరుబాట, బిసిలపై జరిగే దాడులు, బిసి అట్రాసిటీ జీవో తేవటం జరుగుతుందన్నారు. బిసి స్టడీ సర్కిల్, బిసి భవనాలు, బిసి ఆదరణ, బిసిల అభివృద్ధికి కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఉలిందకొండ రమణ, గంగాధర్ గౌడ్, కేతురు మధు, ధనుంజయ, వాకిటి మాదేశ్, రామాంజనేయులు, రవి రెడ్డి, దేవేంద్ర రెడ్డి, శేఖర్ చౌదరి, వెంకటేష్, బాబు, విశ్వం, కాజ, బిసన్న, వెంకటస్వామి, అమర్నాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న నాయకులు

రైతు కుటుంబాలకు ఆర్థికసాయం పంపిణీ

ప్రజాశక్తి తుగ్గలి

మండలంలోని మారెళ్ళ గ్రామానికి చెందిన రైతు బోయ తలారి సుంకన్న, రామలింగయ్య పల్లె గ్రామానికి చెందిన రైతు అంగడి ఈశ్వరయ్యలు ఇటీవల అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకోవడంతో వారి కుటుంబ సభ్యులు బోయ కళావతి, అంగడి లక్ష్మీదేవిలకు పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి ఒక్కొక్కరికి రు.7 లక్షలు చెక్కును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అప్పుల బాధతో ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దన్నారు. కుటుంబ సభ్యులు ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.7 లక్షలు ఆర్థిక సహాయం అందించినట్లు చెప్పారు. రంగనాథ స్వామి సహకార సంఘం అధ్యక్షులు రామలింగయ్య, పల్లె రంగనాథ్ రెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలో టిడిపి కార్యకర్త రైతు అంగడి ఈశ్వరయ్య అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకోవడంతో పార్టీలకతీతంగా ఆ కుటుంబానికి రూ.7 లక్షలు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పవన్ కుమార్, ఎంపీఈవో అజారుద్దీన్, స్థానిక వైసిపి నాయకులు తిమ్మారెడ్డి, నాగిరెడ్డి, సుధాకర్ రెడ్డి, లింగన్న తదితరులు పాల్గొన్నారు.


చెక్కులను పంపిణి చేస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వసతులను ఉపయోగించుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వసంత నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సంపత్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో మొదటి, రెండవ, మూడవ స్థానంలో నిలిచిన స్నేహకు రూ. 3 వేలు, శాంతికి రూ. 2 వేలు, గోవర్ధన్‌కు రూ. వెయ్యి నగదు ప్రోత్సహకాన్ని అందజేసి, సర్టిఫికేట్, మెడల్స్‌తో సన్మానించారు. అనంతరం సర్పంచి బి.శ్రీనివాసులు, విద్యా కమిటీ చైర్మన్ కె.రాంబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి క్రిష్ణవేణి, ఆప్టా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్ రావు, ఉపాధ్యాయులు సుబ్బారాయుడు, వరప్రసాద్, మనోహర్, పద్మావతి, మస్తాన్ వలి, రమణ గుప్త, పిడి పుల్లన్న, శ్రీనాథ్, దత్తాత్రేయ, రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు. **క్రిష్ణగిరి :** క్రిష్ణగిరి మండలం కోయిలకొండ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు కే.ఆదిత్యకు రూ. 3 వేలు, చెరువు యశ్వంత్‌కు రూ. 2 వేలు, బోయిని స్వప్నకు రూ. వెయిక్య నగదు, సర్టిఫికెట్స్, మెడల్స్‌ను ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హెచ్‌ఎం

గృహ నిర్మాణాలు ముమ్మరం చేయండి. : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : జగనన్న లేఔట్లలో జూలై 15 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల నిర్మాణాల్లో భాగంగా జిల్లాలో కేటాయించిన 18,500 గృహాలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్ హౌసింగ్ ఇంజనీర్లు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న లేఔట్లలో గృహ నిర్మాణాల పురోగతిపై సంబంధిత ఇంజనీరింగ్ అసిస్టెంట్ లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి కేటాయించిన 18,500 గహాల లక్ష్యాన్ని వచ్చే నెల 15 నాటికి పూర్తి చేయాలని సచివాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన 12,967 గృహాలలో ఇప్పటివరకు 2,314 గృహాలు ఇంకా ప్రారంభం కాలేదని వెంటనే గ్రౌండింగ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పిడి భాస్కర్ నాయుడు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, అన్ని మండలాల హౌసింగ్ ఇంజనీర్లు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



పత్తికొండ ఎంఇఓ-2గా రమేష్

ప్రజాశక్తి - పత్తికొండ

పత్తికొండ ఎంఇఓ-2గా జి.రమేష్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత ఎంఇఓ మస్తాన్వలి, ఎస్టియు నాయకులు సత్యనారాయణ, జిల్లా ఆర్థిక కార్యదర్శి రామ్మోహన్ రెడ్డిలు జి రమేష్‌కు పూలమాలవేసి అభినందించారు. జి.రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా పని చేస్తానని,అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని తెలిపారు.

పశు బీమాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి పాములపాడు

పాములపాడు మండలంలోని రైతులు వైఎస్ఆర్ పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి అనిల్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఆవులకు, గేదెలకు, గొర్రెలకు, మేకలకు, పందులకు బీమా చేసుకుంటే భరోసా ఉంటుందన్నారు. వైట్ రేషన్ కార్డు కలిగిన వారికి బీమా చెల్లించేందుకు 80 శాతం, ఇతరులకు 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. రూ.15 వేలు విలువ చేసే పశువులకు బీమా రూ. 198.29, రూ. 30 వేలు విలువ చేసే పశువులకు రూ. 397.59 బీమా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - పాణ్యం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, యోగాను దైనందిన కార్యంగా అలవరచుకోవాలని పాణ్యం ప్రభుత్వ వైద్యురాలు శ్రీదేవి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నాడు పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది ప్రసాద్ పాల్గొన్నారు.

అన్నదానికి రూ. 45 వేలు విరాళం

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచర్ల పట్టణంలోని గౌరీపేటలో గల పూదోట ఆశ్రమంలో భక్తుల అన్నదానానికి రూ. 45 వేలు విరాళంగా దాతలు మంగళవారం అందజేశారు. దాతలు గుండా జగన్ మోహన్ రావు, అరుణ్ బాబు, తెలుగు వెంకటరమణ, బుగ్గన మహేశ్వర్ రెడ్డి, కుంచె నాగేశ్వర్ రెడ్డి, ఆలంపల్లి మధుసూదన్ గుప్తా, బుగ్గల చంద్రారెడ్డిలకు నిర్వాహకులు సన్మానించారు.

సచివాలయాన్ని ఎంపిడిఓ తనిఖీ

ప్రజాశక్తి - తుగ్గలి

మండలంలోని రాంపల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఓ సావిత్రి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. లేనిపక్షంలో సచివాలయం ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురి అవతారన్నారు. ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 దాకా సచివాలయంలో ప్రతి ఉద్యోగి అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించాలన్నారు. పంచాయితీ కార్యదర్శి రాజు నాయక్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



నిరుపయోగంగా రైతు బజార్

- రెండేళ్ల క్రితం అట్టహాసంగా ప్రారంభం
- నేటికీ ఉపయోగంలోకి తీసుకురాని అధికారులు

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ పాలక మండలిలో పాములపాడు, కొత్తపల్లి, ఆత్మకూరు, వెలుగోడు, మండలాలకు చెందిన రైతులు ఉండేవారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే మార్కెట్ యార్డ్‌లో రైతు బజార్ నిర్మించాలని అప్పటి పాలకమండలి సభ్యులు తీర్మానం చేశారు. అందులో భాగంగా రూ. 65 లక్షలతో నాలుగు గదులు నిర్మించడంతోపాటు మరో 32 షెడ్లను నిర్మించారు. రైతులు పండించిన పంటలను ఇక్కడికి తీసుకొచ్చి ప్రజలకు విక్రయించేందుకు రైతు బజార్‌ను నిర్మించామని ప్రజా ప్రతినిధులు, అధికారులు గొప్పలు చెప్పారు. ఈ రైతు బజార్‌ను ప్రారంభించిన తర్వాత గేట్లకు తాళం వేయడంతో ఎవరికి ఉపయోగం లేకుండా నేడు నిరుపయోగంగా మారింది. గత సంవత్సర క్రితం వరకు ఈ రైతు బజార్ మందుబాబులకు అడ్డాగా ఉండేది. ఈ విషయంపై అప్పుడు పత్రికల్లో కథనాలు, వార్తలు ప్రచురితం కావడంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు నాటి నుండి రైతు బజార్‌కు తాళం వేశారు. ఇదే 65 లక్షల రూపాయలతో కర్నూల్-గుంటూరు రహదారి వైపు గదులు నిర్మించినట్లయితే వాణిజ్య షాపులకు, రైతులకు ఈ షాపులు ఎంతో ఉపయోగంగా ఉండేవని పలువురు పేర్కొంటున్నారు. ప్రతి శనివారం మార్కెట్ యార్డులో పశువుల సంత జరుగుతుంది. అయితే ఈ పశువుల సంత అయినా రైతు బజార్లో వ్యాపారస్తులకు స్థలాలు కేటాయించి అక్కడ పశువుల విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుంటే మార్కెట్ యార్డ్‌కు అదనపు ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. రైతు బజార్ నిర్మించిన కాంట్రాక్టర్లకు మాత్రం వరంగా మారింది. రైతులకు మాత్రం ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు నిరుపయోగంగా ఉన్న రైతు బజార్‌ను వాడుకలోకి తీసుకొచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

ఆత్మకూరు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ ఆధ్వర్యంలో దాదాపు రెండు సంవత్సరాల క్రితం 65 లక్షల రూపాయలతో నిర్మించిన రైతు బజార్ నిరుపయోగంగా మారింది. రెండేళ్ల క్రితం శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి రైతు బజారును అట్టహాసంగా ప్రారంభించారు. రెండేళ్లు పూర్తి అవుతున్న రైతు బజార్‌కి వేసిన తాళాలు వేసినట్లే ఉన్నాయి. నేటికీ రైతు బజారును అందుబాటులోకి తీసుకురాకపోవడంతో అసలు ఎందుకు నిర్మించారోనని రైతులు, ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నిర్మించిన రైతు బజార్



గోడపత్రికలు విడుదల చేస్తున్న నాయకులు

పోలవరం నిర్వాసితులను ఆదుకోవాలి

మహాపాదయాత్రను జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - నంద్యాల

పోలవరం నిర్వాసితుల మహా పాదయాత్ర సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుండి జూలై 4 వ తేదీ వరకు 15 రోజులపాటు 400 కిలోమీటర్లు నిర్వహించే మహా పాదయాత్ర పోస్టర్లను పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సిపిఎం జిల్లా కార్యాలయం నందు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్, పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహ, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కే మహమ్మద్ గౌస్ లక్ష్మణ్, వెంకట లింగం, ప్రజాసంఘాల నాయకులు బంగారయ్య, లక్ష్మణ్,సెల్వరాజ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులందరికీ 2013 భూసేకరణ చట్టం ప్రకారం పునరావాసం, పరిహారం ఇవ్వాలన్నారు. మహా పాదయాత్రలో వేలాదిమంది ప్రజలు పాల్గొంటున్నారని ప్రభుత్వం ఇప్పటికైనా వారి సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.

నేరాల కట్టడికి చర్యలు

- జిల్లా ఎస్‌పి కె. రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో నేరాల సంఖ్యను తగ్గించాలని, పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ నేరాల కట్టడికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి అన్నారు. మంగళవారం నంద్యాల జిల్లాలోని బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి జూమ్ మీటింగ్ ద్వారా నంద్యాల జిల్లాకు సంబంధించి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా 'పోలీస స్పందన, జగనన్నకు చెబుదాం' కు సంబంధించిన ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని, ఫిర్యాదులపై చట్ట పరిధిలో సమగ్ర విచారణ జరపాలని, స్పందన ఫిర్యాదుల సమస్యలను జవాబుదారీ తనంతో పరిష్కరించాలని, అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో, నిర్ణీత గడువు లోపల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చెయ్యాలన్నారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను జిల్లా పోలీసు కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. అలాగే పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వాటి స్థితిగతులు, నమోదైన కేసుల్లో నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు వాటి పురోగతిపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి కేసుల ఫైల్లను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్ల వారీగా యూఐ కేసులు తగ్గించుకోవా లన్నారు. నిర్ణీత గడువులోపు పెండింగ్ కేసులను పరిష్కార దశకు తీసుకు రావాలన్నారు. హత్యలు, హత్యాయత్నాలు, క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్, గర్ల్ మిస్సింగ్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, తదితర కేసులను సమీక్ష చేశారు. ఈ కేసులలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని త్వరితగతిన పరిష్కారం కనుగొనేలా చేయాలని ఆదేశించారు. నమోదైన కేసులలో సమగ్ర దర్యాప్తు నిర్వహించి నేరస్తులు తప్పించుకునే వీలు లేకుండా న్యాయ స్థానాలలో తగిన సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టి నేరస్తులకు శిక్ష పడే విధంగా అన్నీ ఆధారాలు సేకరించి చార్జిషీట్ ధాఖలు చేయాల న్నారు. పోలీసు స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాలను సీసీటీఎన్‌ఎస్ లో ఎప్పటికప్పుడు పొందుపరచాలని తెలిపారు. లోన్ యాప్ల మోసాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి .వెంకట రాముడు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి జెవి సంతోష్, డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్ బ్యూరో సీఐ జయరాములు, ఎస్ఐలు అశోక్ తదితరులు పాల్గొన్నారు.



వర్చువల్ విధానంతో మాట్లాడుతున్న ఎస్‌పి



జ్యోతి ప్రజ్వలన గవిస్తున్న జిల్లా కలెక్టర్, ఎంపి పోచా, ఎమ్మెల్యే లు తదితరులు

ఎంపిక చేసిన గ్రామాల్లో
మౌలిక వసతులు సమకూర్చండి

- నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మనంద రెడ్డి
-గ్రామ అభివృద్ధికి నిధులు సమకూర్చుకోండి : జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సన్సద్ ఆదర్శ గ్రామ యోజన పథకం కింద జిల్లాలో ఎంపిక చేసిన ఐదు గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి అవరోధంగా ఉన్న సమస్యల ను గుర్తించి పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మనంద రెడ్డి ఇంచార్జి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వైయస్సార్ సెంటినరీ హాలులో సన్సద్ ఆదర్శ గ్రామ యోజన పథకంపై జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సామూన్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ సన్సద్ ఆదర్శ గ్రామ యోజన పథకం కింద ఎంపిక చేసిన గ్రామాల్లో వారానికోసారి పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపి అభివృద్ధికి సంబంధించి ఏ శాఖ అవసరమైతే ఆయా శాఖలతో సమన్వయం చేసుకొని తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ నిధుల కేటాయింపుకు ఎదురు చూడకుండా గ్రామాభివద్ధికి ఆయా గ్రామంలోనే నిధులు సమకూర్చుకునేందుకు స్థానికంగా వనరులను అన్వేషించాలని గ్రామ సర్పంచులను, పంచాయతీ సెక్రెటరీలను కలెక్టర్ ఆదేశించారు. ఎంపీ లాడ్స్ కింద వివిధ అభివృద్ధి పనులకు సహకరించిన ఎంపికి జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, డిప్యూటీ సిఈఓ సుబ్బారెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ రామ్మోహన్, ఆర్డబ్ల్యూ ఎస్ ఎస్ఈ మనోహర్, డ్వామా పిడి రామచంద్రారెడ్డి, సర్పంచ్ లు, వివిధ శాఖల కమిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు

విద్యుత్ చార్జీలు తక్షణమే తగ్గించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం నందికొట్కూరులోని సిపిఎం కార్యాలయంలో నాయకులు పి వెంకటేశ్వర్లు, పి పకీర్ సాహెబ్, టి గోపాలకృష్ణ, వేణుగోపాల్, నాగన్న తదితరులు పెంచిన విద్యుత్ చార్జీల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ ఆదేశాలకు తలొగ్గిన జగన్ ప్రభుత్వం గత 10 సంవత్సరాల నుండి వాడుకున్న కరెంటుకు కస్టమర్, సర్ ఛార్జీలు, విద్యుత్ సుంకం, సర్దు సర్దుబాటు చార్జీల పేర్లతో గత నాలుగేళ్లగా 25 వేల కోట్ల రూపాయలు పెంచి జనాన్ని పిప్పి చేస్తున్నారని అన్నారు. విద్యుత్ రంగాన్ని ఆదాని తదితర బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి రైతు మోటార్లకు మీటర్లు బిగించడం, ప్రతి ఇంటికి, షాపులకు స్మార్ట్ మీటర్లు బిగించబోతున్నారని తెలిపారు. విద్యుత్ చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా ఈనెల 30న రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమంలో భాగంగా నందికొట్కూరులో ఆందోళన చేపడతామని, అందులో భాగంగా ఈనెల 23న నందికొట్కూరు కిసాన్ పార్కులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

వీడిన దారుణ హత్యకేసు మిస్టరీ

- అక్రమ సంబంధమే కడతేర్చింది
- నిందిడుతు అరెస్టు
- వివరాలు వెల్లడించిన డిఎస్‌పి, సిఐ

ప్రజాశక్తి - నందికొట్కూరు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పట్టణంలోని మారుతి నగర్‌లో గుర్రం రాములమ్మ హత్య కేసు మిస్టరీ వీడింది. అక్రమ సంబంధమే హత్యకు దారి తీసింది. హత్య కేసులో నిందితుడు మాధవరం వెంకటేశ్వర్లును మంగళవారం పట్టణ సిఐ ఓ.విజయభాస్కర్, ఎస్ఐ ఎన్‌వి రమణ, సిబ్బంది పట్టణ శివారులోని మార్కెట్ యార్డ్ వద్ద అరెస్టు చేశారు. ఈ సందర్భంగా డిఎస్పి శ్రీనివాసరావు పాత్రికేయుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 'వెంకటేశ్వర్లు నందికొట్కూరు టౌన్ మారుతి నగర్‌లో నివాసం ఉండేవాడు. అతనికి దూరపు బంధువైన గుర్రం రాములమ్మను పగిడ్యాలకు చెందిన బాలయ్యకు ఇచ్చి సుమారు 20 సంవత్సరాల క్రితం పెళ్లి చేశారు. ఆమె గత ఐదు సంవత్సరాల నుండి భర్తతో విడిపోయి మారుతి నగర్‌లో ఉన్న తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఆమె తల్లిదండ్రులది స్వగ్రామం ఎర్రమఠం. అయితే వాళ్లు గత ఎనిమిది సంవత్సరాల నుండి మారుతి నగర్‌లో స్థలం కొనుక్కొని ఉంటున్నారు. రాములమ్మ పటేల్ సెంటర్‌లోని శ్రీ నవ్యకళ బట్టల షాపులో పని చేస్తుంది. గత సంవత్సర కాలం నుండి వెంకటేశ్వర్లుతో ఆమెకు అక్రమ సంబంధం ఏర్పడి అతను ఆమె ఇంటికి పోయేవాడు. ఈ మధ్యకాలంలో రాములమ్మ అతన్ని ఇంటికి రానివ్వడం లేదు. ఆమె వేరే వారితో తిరుగుతుందని అతనికి తెలిసి గత పది రోజుల నుండి వెంటపడి వేధిస్తూ ఏదో విధంగా చంపాలని నిర్ణయించుకున్నాడు. రాములమ్మ ఒక్కరే ఇంట్లో ఉందని తెలుసుకున్న వెంకటేశ్వర్లు కత్తితో ఈ నెల 17న వెళ్లి ఆమెతో గొడవ పడి దాడి చేశాడు. కత్తితో గొంతు కోయగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది' అని డిఎస్‌పి తెలిపారు.

లెగసీ వేస్ట్ లిఫ్టింగ్ ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్



లేగసి వెస్ట్ పనులను పరిశీలిస్తున్న చైర్ పర్సన్, కమీషనర్

పట్టణంలో రూ.5.5 కోట్లు వ్యయంతో కంపోస్ట్ యార్డ్‌లో లెగసీ వేస్ట్ లిఫ్టింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ షేక్. మాబున్నీ సా తెలిపారు. మంగళవారం మునిసిపల్ ఛైర్పర్సన్ షేక్ మాబున్నీ సా , మునిసిపల్ కమిషనర్ సి. రవి చంద్రారెడ్డి, మునిసిపల్ ఇంజినీర్ రమణ మూర్తి, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డా. అంకిరెడ్డిలతో కలిసి ఆమె పట్టణం లోని పీవీ నగర్ వద్ద ఏర్పాటు చేసిన కంపోస్ట్ యార్డ్ లో, జరుగుచున్న, లెగసీ వేస్ట్ లిఫ్టింగ్ ,ను పరిశీలించారు. 15 రోజులలో పూర్తిగా క్లియర్ చేయుటకు అవసరమైన, అన్ని రకాల చర్యలు తీసుకోవా లని చైర్ పర్సన్ మాబున్నీ సా తెలిపారు. ప్రతి టిప్పర్ వెయిఫింగ్ త్రు కంప్యూటరిస్డ్ ద్వారా చేసేలా అన్ని రక్షణ చర్యలు తప్పక చేయాలని ఆమె ఎంఇ రమణ మూర్తిని సాగర్ మోటార్స్ సంస్థ సిబ్బందిని ఆదేశించారు. నంద్యాల పట్టణంలో ఎలాంటి చెత్త, చెదారం లేకుండా చేయడమే లక్ష్యంగా మున్సిపాలిటీ అధికారులు పని చేస్తున్నారని మున్సిపల్ చైర్ పర్సన్ ఎస్. మాబున్నీ సా తెలిపారు. పీవీ నగర్ నందు పబ్లిక్ టాయ్లెట్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమం లో మునిసిపల్ డి ఈ మధు కుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్ , వార్డు ఇంచార్జీ తదితరులు పాల్గొన్నారు.

అన్యాక్రాంత భూములను పేదలకు పంచాలి : సిపిఎం

ప్రజాశక్తి - నంద్యాల

ఎస్. దత్తాపురం గ్రామంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని భూమిలేని నిరుపేదలకు ఆ భూములను పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి. రమేష్ కుమార్, ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి. రామచంద్రుడు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.సుధాకర్‌లు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంజా మల మండలం ఎస్. దత్తాపురం గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన వారు రెవిన్యూ అధికారులతో కుమ్మక్కై దాదాపు 90 ఎకరాలు ప్రభుత్వ భూములను కజేశారని వారు ఆరోపించారు. ఈ భూములకు రెవిన్యూ అధికారుల అండతో పట్టాదారు పాసు పుస్తకాలు పుట్టించుకొని ప్రభుత్వం ఇచ్చే అన్నిరకాల సబ్సిడీలు బ్యాంక్ లలో రుణాలు అనుభవిస్తున్నారని తెలిపారు. ఆ భూములను బ్యాంక్‌లలో తనఖా పెట్టి లక్షల్లో రుణాలు తీసుకోని వివిధ రకాల వ్యాపారాలు చేస్తూ అనుభవిస్తూ ప్రభుత్వ సొమ్మును లూటి చేస్తు న్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములే కాకుండా ఎస్ఆర్‌బిసికి కేటాయించిన భూములను కూడా ఆక్రమించుకొని అధికార పార్టీకి చెందిన నాయకులు అనుభవిస్తున్నారని, జిల్లా అధికార యంత్రాంగం, జిల్లా కలెక్టర్ స్పందించి వీటిపైన సమగ్ర విచారణ జరిపించి ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. పేరుసోముల, ఎస్. దత్తాపురం గ్రామంలో భూమి లేని నిరుపేదలకు ఆ భూములను పంపిణీ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. లేని పక్షంలో సిపిఎం, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆభూములను ఆక్రమించుకొని పేదలకు పంపిణీ చేస్తామని వారు హెచ్చరించారు.

అలగనూరు పేదలకు భూములు చూపండి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మిడ్తూరు మండలంలో అలగనూరు పేదలకు పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చారని, అయితే భూములు ఎక్కడ ఉన్నాయో వారికి తెలియదని తక్షణమే పట్టాలు పొందిన వారికీ భూములు చూపాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి. రామచంద్రుడు, మిడ్తూరు మండల కార్యదర్శి ఓబులేసులు జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్‌ను కోరారు. మంగళవారం బాధిత రైతులతో కలిసి జిల్లా కలెక్టర్‌ను కలిసి వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిడ్తూరు మండలం అలగనూరు గ్రామ ప్రజలకు 1996 సంవత్సరంలో 46 కుటుంబాలకు రెండున్నర ఎకరాల చొప్పున భూ పంపిణీ చేయడం జరిగిందని ఆ సందర్భంగా పట్టాలు పాసు పుస్తకాలు ఆ పేదలకు ఇవ్వడం జరిగిందన్నారు. కానీ రెవిన్యూ అధికారులు ఇంతవరకు ఆ భూములు ఎక్కడ ఉన్నాయో చూపలేదని, ఆ భూములు చూపాలని కోరారు. స్పందించిన కలెక్టర్ ఈ సమస్యను వెంటనే పరిష్కారం చేస్తామని వారికీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అలగనూరు గ్రామ భూ బాధితులు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను కలిసిన భాధితులు, వృకాసం, ఎపి రైతు సంఘం నేతలు

పోలీసుల వేధింపులు తాళలేక యువకుడు ఆత్మహత్య



మృతిచెందిన చిన్నబాబు

ప్రజాశక్తి - మహానంది

పోలీసుల వేధింపులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గోపవరం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. మంగళవారం గోపవరం గ్రామ సమీపంలో నంద్యాల తోట లైనుకు చెందిన చిన్న బాబు (22) అనే యువకుడు రైల్వే ట్రాక్‌పై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల మేరకు.. బైకు చోరీ కేసు విషయంలో చిన్న బాబు అనే యువకుడిని సోమవారం రాత్రి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు తీసుకు వెళ్లిన పోలీసులు విచారించారు. చేయని నేరానికి అవమానాన్ని భరించలేక బాధితుడు చిన్న బాబు సెల్ఫీ వీడియో తీసుకొని రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం బాలుడిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రైల్వే పోలీసుల సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సెల్ఫీ వీడియోలో బాధితుడు చిన్న బాబు తనపై లేని కేసును వన్ టౌన్ పోలీసులు పెట్టారని, కేసును ఒప్పుకోమని వన్ టౌన్ ఎస్ఐ సుబ్బరామిరెడ్డి, కానిస్టేబుల్స్ నాగ న్న, ఏసుదాసు బెదిరిస్తున్నారని ఈ అవమానాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్టు సెల్ఫీ వీడియోలో తెలిపారు.

రూ.50 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి : సిపిఎం

నంద్యాల కలెక్టరేట్: చిన్న బాబు ఆత్మహత్యకు పోలీసుల వేధింపులే కారణమని సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహ,కార్యదర్శి వర్గ సభ్యులు డి లక్ష్మణ్, వెంకట లింగం, ఎస్ఎఫ్ఐ నాయకులు మధు కిరణ్‌లు ఆరోపించారు. మంగళవారం సిపిఎం ప్రతినిధుల బృందం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉన్న చినబాబు మృతదేహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ నంద్యాల పట్టణం తోట లైన్ వీధికి చెందిన చిన్నబాబు ఊరఫ్ (సన్న) పెయింట్ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడని, ఆ కుటుంబానికి మంచి పేరు ఉందని అటువంటి కుటుంబంలో వున్న వ్యక్తి పైన దొంగతనం నింద పోలీసులు మోపరన్నారు. కారణమైన ఒకటో పట్టణ ఎస్ఐ సుబ్బరామిరెడ్డిని, ఇద్దరు క్రైమ్ బ్రాంచ్ కానిస్టేబుల్స్ నాగన్న ఏసుదాసులను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. తక్షణమే మృతుడి కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

బాధ్యులను శిక్షించాలి : సిపిఐ

నంద్యాల : చిన్నబాబుపై పోలీసులు అక్రమంగా దొంగతనం కేసు మోపి చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఆత్మహత్య చేసుకునాడని కారకులైన పోలీ సులను సస్పెండ్ చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి. ఎన్.రంగ నాయుడు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్, సిపిఐ పట్టణ కార్యదర్శి కే ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు మట్లాడుతూ చిన్నబాబు కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్రేగేసియా చెల్లించి, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని పేర్కొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న నాయకులు

త్రిపుర బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి - పాములపాడు

త్రిపురలో బిజెపి చేసిన దాడుల్లో నిరాశ్రయులయిన బాధితుల కోసం ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పాముల పాడు మండల కేంద్రంలో విరాళాల సేకరణ నిర్వహించారు. ఈ సేకరణలో 3575 రూపాయలు వచ్చినట్లు రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వర తెలిపారు. ఆయన మాట్లాడుతూ బిజెపి చేసిన దాడుల్లో ఎంతో మంది నిరాశ్రులయ్యారని అన్నారు. త్రిపురలో బిజెపి పాలనకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై దాడులు జరుగుతున్నాయని, ప్రజాస్వామ్య వాదులంతా ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బాలయ్య, ఎస్ఆర్ రమణ, బాల యేసు, ప్రజాశక్తి డివిజన్ ఇంచార్జి హనుమంతు, రామ్మూర్తి, వైఆర్‌డిఎస్ అధ్యక్షులు షర్ఫుద్దీన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు నగదు బహుమతి

ప్రజాశక్తి - గడివేముల

మండలంలోని గడిగరేవుల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆణిముత్యాల నగదు బహుమతి, ప్రశంసాపత్రాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచి రామ్మోహన్ రెడ్డి, ఎంఇఒ-2 విమల వసుంధర దేవి, విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీటీసీ సావిత్రి హాజరయ్యారు. పదవ తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థి నాగేంద్ర కుమార్‌కు రూ. 3వేలు, రెండవ స్థానం విద్యార్థికి రూ. 2 వేలు, మూడవ స్థానం విద్యార్థికి రూ. వెయ్యి సర్పంచి చేతుల మీదుగా అందజేశారు. అలాగే సర్పంచి తన సొంత నిధులతో వారికి రూ. 3 వేలు, రూ. 2,500, రూ.1,500 అందజేశారు. అలాగే ఉపాధ్యాయుడు నగరీ శ్రీనివాసులు విద్యార్థులకు రూ. 5వేలు, రూ. 3 వేలు, రూ. 2 వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు దస్తగిరిమ్మ,ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు బహుమతులను అందిస్తున్న సర్పంచ్

పంట నష్ట పరిహారం చెక్కులు పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న అటవీ శాఖ అధికారులు

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు మండలంలో అడవి పందుల దాడికి పంటలు నష్టపోయిన రైతులకు అటవీశాఖ అధికారులు మంగళవారం నష్టపరిహారం చెక్కులను పంపిణీ చేశారు. 20 చెక్కులకు గాను రూ.94,200 పంట నష్ట పరిహారం అందించినట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మల్లేష్, బీట్ ఆఫీసర్ జనార్ధన్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ముష్టపల్లె, శ్రీపతిరావు పేట, ఇందిరేశ్వరం గ్రామాలకు చెందిన 20 మంది రైతులకు పంట నష్ట పరిహారం చెక్కులను అందించామన్నారు. అటవీ సమీప గ్రామాల రైతులు అడవి పందుల వల్ల పంటలు నష్టపోతే నేరుగా అటవీశాఖ అధికారులకు సమాచారం అందిస్తే పొలాన్ని పరిశీలించి నష్ట పరిహారం అందిస్తామని తెలిపారు.

కల్తీ విత్తన విక్రయాలపై కఠిన చర్యలు

ప్రజాశక్తి - మిడుతూరు

మిడుతూరు మండల కేంద్రంలో కల్తీ విత్తన విక్రయాలు జరిగితే కఠిన చర్యలు తీసు కుంటామని తహశీల్దార్ ప్రకాష్ బాబు, వ్యవసాయ అధికారి పీర్ నాయక్, ఎస్సై మారుతి శంకర్‌లు హెచ్చరించారు. మంగళ వారం స్థానిక గ్రోమోర్ సెంటర్, కిసాన్ అగ్రిమాల్ కేంద్రాలను వారు తనికీ చేశారు. పత్తి విత్తనాలను వారు పరిశీలించారు. కిసాన్ అగ్రిమాల్ సెంటర్లో దాదాపు రూ. 4 లక్షల 94 వేల 492 విలువ గల పత్తి, మొక్కజొన్న విత్తనాలను అమ్మకుండా నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిరప, మొక్కజొన్న, పత్తి తదితర విత్తనాలు కల్తీ లేకుండా నాణ్యమైనవి విక్రయించాలని వ్యా పారస్తులకు సూచించారు. ఎక్కడైనా లూజు విత్తనాలు అమ్మి నట్లయితే కఠిన చర్యలు తీసు కుంటామని తలెఇపారు. రైతులు విత్తనాలు కొనేటప్పుడు ప్రభుత్వం సూచించినవి మాత్రమే కొనుగోలు చేయాల న్నారు. నకిలీ పురుగు మందులను విక్రయిం చినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం


సన్మానిస్తున్న ఎమ్మెల్యే

టీమ్ జగనన్న టాప్ పర్ఫార్మెన్స్‌లకు సన్మానం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

నియోజకవర్గంలోని వైసిపి సోషల్ మీడియా టీమ్ జగనన్న యాప్ ద్వారా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉంటున్న పాలుట్ల నాగేంద్ర , గుర్రం అనిల్ కుమార్, లింగ భూపతి రెడ్డి, మల్లికార్జునరెడ్డి, అంబరపు ప్రసాద్‌లను ఎమ్మెల్యే మంగళ వారం ఘనంగా సన్మానించి సర్టిఫికేట్లు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాలన్నీ 98.3% ప్రజలకు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో విజయ మిల్క్ డైరీ చైర్మన్ ఎస్.వి జగన్మోహన్ రెడ్డి, కౌన్సిలర్ గోట్లూరు సుధాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నరసింహారెడ్డి, ప్రముఖ వైద్యులు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



రైతు ఆత్మహత్యపై ఎడిఎ ప్రాథమిక విచారణ

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండలం వేంపెంట గ్రామపంచాయతీ మజరా గుండాలనట్టు గ్రామంలో రైతు హరినాయక్ అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఆత్మకూరు ఏడిఏ ఆంజనేయ కుటుంబ సభ్యులతో మంగళవారం ప్రాథమిక విచారణ చేపట్టారు. సొంత పొలం, కౌలుకు తీసుకున్న పొలం, పంట, అప్పు చేసిన వివరాలపై ఆరా తీశారు. పొలం డాక్యుమెంట్స్, ఈక్రాప్ బుకింగ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రాథమికంగా జరిపిన విచారణపై నివేదికను జిల్లా స్థాయి అధికారులకు పంపుతామన్నారు. మరిన్ని వివరాలను గ్రామ, మండల స్థాయి కమిటీలు విచారించి తుది నిర్ణయానికి పై స్థాయి అధికారులకు పంపుతామన్నారు. విచారణలో ఏవో పనిశ్వర్ రెడ్డి, వీఆర్వో నాగభూషణం, కానిస్టేబుల్ కర్ణ పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్‌గా హరికిషన్

ప్రజాశక్తి - చాగలమర్రి



చాగలమర్రి మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా హరికిషన్ మంగళవారం బాధ్యతలు చేపట్టాడు. ఇక్కడ జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు సాదారణ బదిలీలలో భాగంగా కర్నూలు జిల్లా తుగ్గలి మండలం ఆర్ఎస్ పెండెకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీ కాగా జిల్లా పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న హరికిషన్ బదిలీపై వచ్చి మండల పరిషత్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందిస్తానని ఆయన తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : ఎంపిపి

ప్రజాశక్తి - అవుకు

మండలంలోని గ్రామాల్లో నివసిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరి ంచడమే మండల స్థాయి అధికారుల బాధ్యత అని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి అన్నారు. అవుకు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ హాజరు కావడంతో సభ కళకళలాడింది. గత సమావేశాలకు డుమ్మా కొట్టిన అధికారులకు మెమోలు పంపించడంతో ఈసారి జరిగిన సర్వ సభ్య సమావేశానికి అధికారులు అందరూ పాల్గొన్నారు. ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వర్షపాతం నమోదు చేసే సమయాల్లో కొండలపైన వర్షాభావం తక్కువగా ఉంటుందని కొండల కింది గ్రామాల్లో వర్షం అధికంగా ఉంటుందని దానివలన కొండలపైన గ్రామాల్లోని ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. రామాపురం గ్రామంలో జాతీయ రహదారి పూర్తిగా శిథిలమై ఉందని ఈ విషయంపై పలుమార్లు మండల సభలో చర్చించడం జరిగిందని అయినా ఫలితం లేదని వాపోయారు. ఈ విషయంపై జాతీయ రహదారి ఏఈ ఫణి శర్మ మాట్లాడుతూ 544 డి రాష్ట్ర స్థాయి జాతీయ రహదారిగా ఉందని కేంద్ర స్థాయి జాతీయ రహదారిగా ఇంతవరకు అనుమతి రాలేదని ఈ రహదారికి ఒక్కడే కాంట్రాక్టర్ ఉన్నాడని గతంలో వేసిన పనులకు ఇంతవరకు బిల్లులు రాకపోవడంతో జాప్యం చేస్తున్నాడని తెలిపారు. రిజర్వాయర్ గేట్లకు ఉన్న ప్రధాన సమస్యను సభలో వివరించగా సంబంధిత అధికారి మాట్లాడుతూ ప్రభుత్వానికి నివేదికలు పంపించామనిఅనుమతి వచ్చిన తర్వాత పనులు చేస్తామని వెల్లడించారు. ఉప్పలపాడు ప్రాథమిక వైద్యులు డాక్టర్ టి వినోద్ కుమార్ మాట్లాడుతూ అతిసార వ్యాధి అప్రమత్తతో ఉండాలని తెలిపారు. ఆర్డబ్ల్యూసీ ఏఈ కరిముల్లా మాట్లాడుతూ జల జీవన్ మిషన్ ద్వారా 8:30 కోటి రూపాయలు 30 గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని ఇప్పటికి 50% పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఓవర్ హెడ్ ట్యాంకులను నెలకు రెండవ తేదీ 17వ తేదీ నెలకు రెండు సార్లు శుభ్రం చేసి నీటికి సరిపడిన బ్లీచింగ్ పౌడర్ ను కలిపి పంపిణీ చే సేల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ ప్రసాద్ బాబు, ఆర్డబ్ల్యూఎస్ డీఈ సునీల్ రెడ్డి, ఎంఈఓ లు శ్రీధర్ రావు, వెంకటేశ్వర రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఇద్దరు ఎంఇఒలు

కేంద్ర పథకాల పనులను సకాలంలో పూర్తి చేయండి

జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ కమిటీ చైర్మన్ పోచా బ్రహ్మానంద రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాలను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నంద్యాల పార్లమెంట్ సభ్యులు, జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ (దిశ) కమిటీ చైర్మన్ పోచా బ్రహ్మానంద రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో దిశ కమిటీ సమావేశం చైర్మన్ అధ్యక్షతన జరిగింది. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సామూన్, ఆళ్లగడ్డ శాసనసభ్యులు బ్రిజేంద్రనాథ్ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ 25 శాఖలకు సంబంధించి 43 సంక్షేమ పథకాల కింద మంజూరు చేసిన పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. జేల జీవన్ మిషన్, వ్యవసాయం, పంచాయితీరాజ్, ఇరిగేషన్, విద్యుత్, మునిసిపల్, డిఆర్డీఏ, వైద్య ఆరోగ్య, జాతీయ రహదారులు, పరిశ్రమల శాఖలచే కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై చైర్మన్ సమీక్షించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ కింద పొలాలకు వెళ్లేందుకు రహదారులు నిర్మించాలని అధికారులను సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జల జీవన్ పథకం పథకం కింద ఇంటింటి కొళాయి పనులను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకో వాలని ఆర్డబ్ల్యు ఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని బనగానపల్లెలో జలజీవన్ పథకం అమలు బాగా జరిగినట్లు ఇటీవల కేంద్ర దృందం కూడా అభినందించినట్లు కలెక్టర్ దిశా కమిటీలో ప్రస్తావించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డ్వామా పిడి రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం నివాసులకు స్థానికంగానే ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం నివాసులకు శ్రీశైలంలోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. కామ్రేడ్స్ రాములమ్మ, చెన్నమ్మ, మనెమ్మల సమాధులపై సిపిఎం, సిఐటియు నాయకులు మంగళవారం పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమనికి నాగవేంకటేశ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మునిపాటి చిన్న మారెన్న, సిఐటియు మండల అధ్యక్షులు దర్శనం నాగరాజు మాట్లాడుతూ సుమారు 15 సంవత్సరాల క్రితం శ్రీశైలంలోని పేదలందరికీ శ్రీశైలంలోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సునిపెంటలోని తహశీల్దార్ కార్యాలయం దగ్గర ధర్నా చేసి తిరిగి వచ్చే సందర్భంలో రోడ్డు ప్రమాదం జరిగి ముగ్గురు మృతి చెందారన్నారు. వారు చనిపోయాక ప్రభుత్వాలు మారుతున్నాయి తప్పా ఇళ్ల సమస్య అలాగే ఉందన్నారు. వారి అశయాల కోసం ఇళ్ల సమస్యలపై పోరాటం చేయాలన్నారు కార్యక్రమంలో బి.చిన్నమని, వెంకటస్వామి, బాలరాజు, ప్రభాకర్, ఆవులయ్య, మౌలాలి, శ్రీను, మనోహర్, వేంకటేశ్, వెంగయ్య, రంగస్వామి, పెద్ద గంగూలు, నారాయణ, చిన్న గంగూలు తదితరులు పాల్గొన్నారు.



కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఘనత వైసిపిదే : ఎమ్మెల్యే


ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కాంటాక్ట్ ఉద్యోగులు

ప్రజాశక్తి - బనగానపల్లె

రాష్ట్ర వ్యాప్తంగా 10,000 వేల కాంట్రాక్ట్ అధ్యాపకులు, ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పొదుపు భవనంలో కాంట్రాక్టు అధ్యాపకులు, ఉద్యోగులు క్రమబద్ధీకరణ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ ,ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో థాంక్యూ సీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం కాంట్రాక్టు అధ్యాపకులు, ఉద్యోగ క్రమబద్ధీకరణ లబ్ధి పొందిన ఉద్యోగులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారని అన్నారు. ఉద్యోగులు జగన్మోహన్ రెడ్డి రుణం తీర్చుకో వాలంటే 2024 ఎన్నికల్లో వైసిపికి అఖండ మెజార్టీని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అవుకు మండల వైసిపి కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, ఎపిఎన్‌జిఒ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గువ్వల రామకృష్ణా రెడ్డి, ఉద్యోగ సంఘం జేఏసీ నాయకుడు నల్లగట్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి అల్తాఫ్ కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు : సర్పంచి


పాఠ్యపుస్తకాలు, షూ పంపిణీ చేస్తున్న సర్పంచి

ప్రజాశక్తి - రుద్రవరం

ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరుగుతుందని కోటకొండ గ్రామ సర్పంచ్ డేగాని వెంకటేష్ తెలిపారు. మంగళవారం జగనన్న విద్య కానుకలో భాగంగా పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను నాడు నేడు కార్యక్రమంలో భాగంగా అన్ని వసతులతో అభివృద్ధి చేసి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తున్నారన్నారు.

మిడుతూరు : మిడుతూరులోని కస్తూరిభా పాఠశాలలో విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు, షూలు ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కస్తూర్బా పాఠశాలలో మొత్తం 200 మంది బాలికలు ఉన్నారని, వీరందరికీ ప్రభుత్వం ఉచితంగా వచ్చిన పాఠ్యపుస్తకాలు, షూ పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

విద్యాభివృద్ధికి కృషి : ఎంఇఒ


ఎంఈఓని అభినందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ప్రజాశక్తి గడివేముల

గడివేముల మండలంలో విద్యాభివృద్ధికి తన శక్తి మేరకు కృషి చేస్తానని నూతన మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఎన్.విమలా వసుంధరా దేవి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో ఏపీటీఎఫ్ మండల, జిల్లా నాయకులు నూతన ఎంఇఒను కలిసి శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గడివేముల మండలంలో గత 22 సంవత్సరాల నుండి వివిధ పాఠశాలల్లో, వివిధ హెూదాల్లో పని చేస్తూ ప్రస్తుతం గడిగరేవుల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేస్తూ ఎంఇఒగా బాధ్యతలు చేపట్టానని తెలిపారు. నాడు- నేడు పనుల వేగవంతానికి కృషి చేస్తానని చెప్పారు. ఏపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలానికి ఎంఈఓ-2 పోస్టులు మంజూరు చేసి చేయడం పట్ల హర్ష వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సర్వీసుకు సంబంధించిన విషయాలను త్వరితగతిన పరిష్కరించాలని విద్యాధికారులను కోరారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్లు ఎస్.మహబూబ్ బాషా, నాగన్న, జిల్లా కార్యదర్శి ఆవుల. మునిస్వామి, మండల ప్రధాన కార్యదర్శి మానపాటి రవి, జిల్లా కౌన్సిలర్లు ఎస్.శ్రీనివాసులు, నాగయ్య, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒ-2గా సుభాషిని దేవి బాధ్యతలు

పాములపాడు: పాములపాడు మండల విద్యాధికారి-2గా సుభాషిని దేవి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక ఎంఆర్‌సి భవనంలో ఎంఇఒ బాలాజీ నాయక్, కార్యాలయ సిబ్బంది, ఎస్ఆర్పీలు, ఐయిఆర్‌టిలు మర్యాదపూర్వకంగా కలిసి ఆమెకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. సుభాషిని దేవి మాట్లాడుతూ విధి నిర్వహణలో అందరి సహకారం అందించాలని ఆమె కోరారు.



అదనపు ఎంఇఒ-2గా వెంకటేశ్వర్ రెడ్డి



అవుకు : అవుకు మండల అదనపు విద్యా శాఖ అధికారి-2గా వై వెంకటేశ్వర్ రెడ్డి మంగళ వారం బాధ్యతలు చేపటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాశాఖను మరింత బలోపేతం చేయటమే తన కర్తవ్యం అని అన్నారు.

పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి : ఎఐకెఎస్

ప్రజాశక్తి - బేతంచెర్ల

రైతులు పండించిన పంటలను ప్రభుత్వ సంస్థల ద్వారా కొనుగోలు చేయాలని, మద్దతు ధరలకై పార్లమెంట్లో చట్టం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.సుబ్బరాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బేతంచెర్ల మండలం ఆర్ఎస్. రంగాపురం సచివాలయం దగ్గర ఎపి రైతుసంఘం మండల నాయకుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రైతాంగ సమస్యలను పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేతంచెర్ల మండలంలో ఒక్క ఎకరాకు కూడా సాగునీటి సౌఖర్యం లేదని, మండలంలోని గూటుపల్లె చెరువుకు హంద్రీనీవా సుజలస్రవంతి కాలువ నీటిని నింపాలన్నారు. తద్వారా చుట్టుప్రక్కల సుమారు 10 గ్రామాల పొలాలలో భూగర్భజలాలు పెరిగి బోరుబావుల కింద వేసిన పంటలకు నీరందుతుందన్నారు. బేతంచెర్ల మండల ప్రజలు, రైతులందరూ గూటుపల్లె చెరువును రిజర్వాయర్‌గా చేయుటకు ఐక్యమై సాధించుకోవాలన్నారు. అనంతరం రంగాపురం గ్రామకార్యదర్శి కృష్ణమూర్తికి, విఆర్ఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కిష్టన్న, ఈశ్వర్ రెడ్డి,వి. పరమేశ్వరరెడ్డి, మాబుసాహెబ్, ఎస్. చిన్నమద్దిలేటి, గుర్రెడ్డి, రామ్మోహన్, రఫి, ఇమామ్ ఖాసీం, బాలన్న నాగయ్య, చిన్నతిమ్మయ్య, సీఐటీయు మండల కార్యదర్శి రహంతుల్లా, రైతులు పాల్గొన్నారు.


వినతి పత్రం ఇస్తున్న నాయకులు

విలేకరిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

పత్తికొండ పట్టణంలో ఆంధ్రజ్యోతి విలేకరి రాజేష్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఐఎఫ్టియు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వై.ఆశీర్వాదం, కార్యదర్శి కె.అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం సున్నిపెంటలోని ఐఎఫ్‌టియు కార్యాలయంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి కొంతమంది పాత్రికేయులపై, మీడియా సంస్థలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం పరిపాటిగా మారిందన్నారు. ఆంధ్రజ్యోతి విలేకరి రాజేష్‌పై దాడి చేయడం ఆమానుషమని అన్నారు. విలేకరులపై దాడి బాధాకరమన్నారు. విలేకరులకు రక్షణ కల్పించాలని, బీమా పథకాన్ని, ఆరోగ్య భద్రతతో పాటు చిన్న, పెద్ద పత్రికలు అనే తేడా లేకుండా అక్రిడిటేషన్లు, బస్సు పాసులు అందజేయాలన్నారు. ఇండ్లు లేని పాత్రికేయులందరికీ ఇంటి స్థలంతో పాటు పక్క గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. విలేకరులపై దాడి చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.


మాట్లాడుతున్న నాయకులు

విద్యుత్ ట్రూప్ చార్జీలు తగ్గించకుంటే

మరో విద్యుత్ ఉద్యమం : సిపిఎం

ప్రజాశక్తి-డోన్

ట్రూఅప్, సర్దుబాటు చార్జీల భారంతో జనానికి కరెంటు బిల్లులను తగ్గించు కుంటే ప్రజలు సిపిఎం మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధమవు తారని సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు నక్కిశ్రీకాంత్, కే.నాగరాజు అన్నారు. మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో కరెంటు బిల్లులతో జనానికి షాక్ సిపిఎం ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరెంటు చార్జీలు పెంపుతో ప్రజలపై రూ.400 కోట్ల భారం పడుతుందని అన్నారు. ప్రభుత్వంపై పోరుకు ప్రజలతో కలిసి సిపిఎం సిద్ధమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ మండల కమిటీ సభ్యులు రామాంజనేయులు,శివరాం,షమీం బేగం,నక్కి హరి పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

క్రీడాకారిణి ఆకాంక్షకు స్పాన్సర్‌షిప్

ప్రజాశక్తి - నంద్యాల

ఇటీవల ఖేలో ఇండియా క్రీడల్లో ప్రతిభను కనబరిచిన శ్రీ రామకృష్ణ విద్యాసంస్థ విద్యార్థినికి ఆకాంక్షకు కళాశాల చైర్మన్ డాక్టర్ జి రామకృష్ణారెడ్డి ఆమెను సన్మానించి స్పాన్సర్‌షిప్ చెక్కును అందజేశారు. మంగళ వారం నాడు కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థి భవిష్యత్తులో క్రీడలలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని అభినందించారు. ఆకాంక్షను రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ప్రొ. ఏ.ఆనంద రావు, స్పోర్ట్స్ మేనేజర్ శివ కిషోర్ అభినందించారు. కళాశాల స్పోర్ట్స్ అథారిటీ మేనేజర్ అయిన హేమంత్ రెడ్డిని అభినందించారు. క్రీడాకారిణి ఆకాంక్ష మాట్లాడుతూ రామకృష్ణారెడ్డికి, హేమంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. జూలై 28 నుండి ఆగస్టు 8 వరకు చైనాలో జరిగే షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఆకాంక్ష పాల్గొనున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుబ్బయ్య, ప్రసాద్ గురూజీ, అధ్యాపకులు లలితా సరస్వతి, కుమార్, వెంకటేశ్వర్లు లక్ష్మీప్రసన్న విద్యార్థులు పాల్గొన్నారు.




ఎంఇఒను సన్మానిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఎంఇఒకు యుటిఎఫ్ నేతలు సన్మానం

ప్రజాశక్తి - ప్యాపిలి

మండల విద్యాశాఖాధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేష్ నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియ చేసినట్లు యుటిఎఫ్ ప్యాపిలి మండల ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు అబ్దుల్ లతీఫ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఉన్న వివిధ రకాల సమస్యలు తెలియచేసినట్లు తెలిపారు. మన బడి నాడు నేడు మొదటి దశ పనులు నిర్వర్తించిన ప్రధానోపాధ్యాయులకు వారి సేవా పుస్తకంలో 15 రోజుల ప్రత్యేక సెలవులను వెంటనే నమోదు చేయాలని కోరారు. అనంతరం విద్యాధికారిని శాలువాతో సత్కరించి పూల మాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రధానోపాధ్యాయులు అన్వర్,జిల్లా కౌన్సి లర్లు అంజనప్ప, రమేష్ నాయుడు,సర్వజ్ఞమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - అవుకు


సంక్షేమ పథకాలు బుక్ లెట్ ను అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

రాష్ట్రంలో ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. మంగళవారం అవుకు మండలంలోని కాశీపురం గ్రామంలో గడపగడప కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక వైసీపీ నాయకులు అయ్యప్ప రెడ్డి, రవికుమార్ రెడ్డి, లతో కలిసి గడపగడపకు తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల బుక్లెట్లను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధం గా రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ కౌన్సిల్ మెంబర్ ముక్కలను పుల్లారెడ్డి , గ్రామ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరంలోని కన్యకా పరమేశ్వరి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యా యుడుగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న శ్రీనివాసరెడ్డిని ఎంఆర్‌సి కార్యాలయపు సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ శ్రీనివాస్ రెడ్డి సేవలు ప్రశంసనీయ మన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిలు రామయ్య, రహమతుల్లా, ఎంఆర్‌సి సిబ్బంది విజయ్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు మండల పరిధిలోని అమలాపురం గ్రామం ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులు రుక్మిణీ, జహీర్ అబ్బాస్, మహేశ్వరిలను ప్రధానోపాధ్యాయులు జాకీర్ అధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారులు జానకిరామ్, సురేష్‌లు హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని, పని చేసిన పాఠశాలలో ఉపాధ్యాయులు ఉద్యోగ నిర్వహణను మంచిగా నిర్వర్తిస్తూ ఉన్నపుడే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. అలాంటి గుర్తింపు బదిలీ పొందిన ఉపాధ్యాయులు పొందారని ప్రశంసించారు. ఉపాధ్యాయులు హబీబ్ బాషా, విజయకు మార్, రియాజ్, వెంకటేష్, దాస్, రఫిక్, గ్రామపెద్దలు తిరుపతయ్య, స్వామన్న, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలకు రహదారి నిర్మించండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని ఆదర్శ పాఠశాలకు వెళ్ళే దారి అధ్వాన్నంగా తయారు అయిందని, వెంటనే నిర్మాణం చేపట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు బత్తిన ప్రతాప్ అన్నారు. మంగళవారం వారు మాట్లాడతూ అధికారులకు, ఎమ్మెల్యేకు ఎన్ని సార్లు వినతి పత్రం సమర్పించిన ఫలితం లేదన్నారు. సమస్యను పరిష్కరించకపోతే జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహి స్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటాద్రి, శ్రీనివాస రావు,నాయక్ విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నందికొట్కూరు

జూపాడుబంగ్లా మండలం భాస్కరాపురం గ్రామం కెసి కెనాల్ బ్రిడ్జి వద్ద అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. మృతుడు పగిడ్యాల మండలం తూర్పు ప్రాతకోట గ్రామానికి చెందిన మూల వెంకటరమణగా పోలీసులు గుర్తించారు. జూపాడుబంగ్లా ఎస్ఐ వెంకట సుబ్బయ్య, సిఐ సుధాకర్ రెడ్డి, డిఎస్‌పి శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అభివృద్ధి పథంలో తమ్మరాజు పల్లె : సర్పంచి

ప్రజాశక్తి - పాణ్యం

ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సహకారంతో తమ్మరాజు పల్లె అభివృద్ధి పథంలో నడుస్తోందని గ్రామ వైసిపి నాయకులు బత్తుల శేసు రెడ్డి అన్నారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఓవర్ హెడ్ ట్యాంక్, సిసి రోడ్లు ఇలాంటి పనులతో గ్రామం అభివృద్ధి చెందిందన్నారు. ఎమ్మెల్యే సహకారంతో ముందుకు తీసుకొని వెళ్తామని నాయకులు అన్నారు.

ఫీజుల దందాను ఆపండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - చాగలమరి


ఎంఈఓ వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మండలంలోని ప్రైవేట్ పాఠశాలలు ఫీజుల దందా ఆపాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు జగన్ కోరారు. మంగళవారం స్థానిక మండల విద్యా శాఖాధికారి కార్యాలయంలో ఎంఇఒ అనురాధకి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పాఠశాలలను ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయని పాఠశాలల గుర్తింపులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సిఐ రాజశేఖర్ రెడ్డి సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ రూరల్ సిఐగా సేవలందించి అనంతపురం జిల్లాకు బదిలీ అయిన రాజశేఖర్ రెడ్డి సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే గంగుల నాని స్వగృహంలో రాజశేఖర్ రెడ్డిని ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజయ డైరీ చైర్మన్ ఎస్వీ జగన్ మోహన్ రెడ్డి, ఆళ్లగడ్డ మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోపవరం నర్సింహా రెడ్డి, వైఎస్సార్సీపీ కన్వీనర్ గోట్లూరు సుధాకర్ రెడ్డి, టౌన్ ఎస్ఐ వెంకట రెడ్డి, విద్యుత్ ఏయి కంబగిరి, వైకాపా నాయకులు గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

